www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
17.10.2024
సంపుటి:2 సంచిక:253

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక



రైతులకు

# గుడ్ న్యూస్

- ఆరు పంటలకు కనీస మద్దతు ధర పెంపు
- ఎంఎస్పీ పెంపు కోసం రూ.87,657 కోట్లు
- దీపావళి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ
- దేశవ్యాప్తంగా రైతుల సంబురాలు
- గోధుమ, ఆవాలు, పెసర్లకు ధర పెంపు

**దేశంలోని రైతులకు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రైతుల ఆదాయాన్ని పెంచడంలో భాగంగా వారు పండించిన పంటలకు మద్దతు ధర పెంచుతూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన భేటీ అయిన కేంద్ర మంత్రి వర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగానే రబీ సీజన్‌లో పండించే 6 పంటలకు కనీస మద్దతు ధర పెంచుతున్నట్లు వెల్లడించింది. ఈ రబీ పంటల ఎంఎస్పీ పెంపు కోసం రూ.87,657 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చించనుంది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు.. దీపావళి సందర్భంగా 3 శాతం డీఏను పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.**

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మొత్తం 6 రబీ పంటల ఎంఎస్పీని కేంద్రం పెంచింది. గోధుమ, ఆవాలు, పెసర్లు, బార్లీ, శనగలు, సన్‌ఫ్లవర్ పంటలకు ఎంఎస్పీని పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 202526 మార్కెటింగ్ సీజన్‌కు గానీ ఈ రబీ పంటల కనీస మద్దతు ధర పెంపు ఉండనున్నట్లు కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. గోధుమలపై క్వింటాల్‌కు ఎంఎస్పీ రూ. 150 పెంచడంతో గతంలో క్వింటాల్ గోధుమ ధర రూ.2275 ఉండగా.. అది కాస్తా రూ.2425కి పెరిగింది. క్వింటాల్ ఆవాలుకు ఎంఎస్పీ రూ.300 పెంచగా.. గతంలో ఉన్న రూ.5,650 నుంచి రూ.5,950 కి పెరిగింది.

ఇక క్వింటాల్ పెసర్లకు రూ.275 ఎంఎస్పీ పెంచగా.. రూ. 6,425 నుంచి రూ.6,700 కి పెరిగింది. ఇక బార్లీ పంట క్వింటాల్‌కు రూ.130 ఎంఎస్పీ పెంచడంతో.. రూ.1,850 నుంచి రూ.1,980కు పెరిగింది. శనగల ఎంఎస్పీ రూ.210 పెంచగా.. అది కాస్తా.. రూ.5,440 నుంచి రూ.5,650కి పెరిగింది. సన్‌ఫ్లవర్ పంటకు ఎంఎస్పీ రూ.140 పెంచడంతో.. రూ.5,800 నుంచి రూ.5,940కి పెరిగింది. ఎంఎస్పీ పెంచడమే కాకుండా రైతులకు మరిన్ని శుభవార్తలను కేంద్ర ప్రభుత్వం అందించింది. రైతుల ఆదాయాన్ని మరింత పెంచడమే లక్ష్యంగా పీఎం అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్ (పీఎం ఆశా) పథకానికి రూ.35 వేల కోట్లు ఇచ్చేందుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక అదే సమయంలో రబీ పంట సీజన్‌కు సంబంధించి నాన్‌యూరియా ఎరువుల సబ్సిడీకి రూ.24,475 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. ఇక ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో గంగా నదిపై కొత్త రైల్వే కమ్ రోడ్డు బ్రిడ్జిని నిర్మించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఈ రైల్వే కమ్ రోడ్డు ప్రాజెక్టు కోసం రూ.2,642 కోట్లు ఖర్చు చేయనున్నారు.



# గ్రూప్ 1 అభ్యర్థుల నిరసన

## అభ్యర్థులను అదుపులోకి తీసున్న పోలీసులు

## మరీక్షలు వేయిదా వేయాలని డిమాండ్

- జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు
- అశోక్ నగరలో మోగుతున్న డేంజర్ బెల్స్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

గ్రూప్1 అభ్యర్థులు మరోసారి నిరసనకు దిగారు. గ్రూప్1 పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. గతంలో జరిగిన పిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని అభ్యర్థులు నిరసన చేపట్టారు. గ్రూప్1 అభ్యర్థుల ఆందోళనతో అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. రోడ్లపై అభ్యర్థులు రావడంతో.. భారీగా పోలీసులను మోహరించారు. ఇప్పటి వరకు దాదాపు 109 మంది అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకొని

..మిగతా 2 లో



జమ్ముకశ్మీర్ సీఎంగా

## ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

- ఆర్టికల్ 370 రద్దు తర్వాత తోలి సీఎం అబ్దుల్లా
- ప్రమాణస్వీకారం చేయించిన లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా
- జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి
- నిరసనగా ప్రమాణస్వీకారం చేయని కాంగ్రెస్ ఎంఎల్‌ఏ

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ లీడర్ ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్ముకశ్మీర్కు

..మిగతా 2 లో


మావోయిస్టులకు

## మరో ఎదురుదెబ్బ

కిషన్ జీ భార్య పోతుల కల్పన అరెస్ట్

- కేంద్రకమిటీ సభ్యురాలిగా ఉన్న కల్పన
- ఆమె బయటకు ఎందుకొచ్చారు?
- పాలమూరులో అరెస్ట్ చేసిన పోలీసులు
- జనతన సర్కారులోనూ ఈమెది కీలక పాత్ర

**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్ట్ దివంగత కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్ జీ భార్య పోతుల కల్పన అలియాస్ సుజాతక్కను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో ఉండగా.. అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ఆమె సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా పని చేస్తున్నారు. కేంద్ర కమిటీ సభ్యురాలిగా పని చేస్తున్నారు. ఆమె కల్పన అలియాస్ సుజాతక్క,



..మిగతా 2 లో



## ఐఏఎస్ లకు హైకోర్టులోనూ నిరాశే

- ముందు రిపోర్ట్ చేయాల్సిందేనని స్పష్టీకరణ
- క్యాట్ ఆదేశాలకు సమర్థన
- కేంద్రం పంపించిన చోటుకు వెళ్లాల్సిందేనని ఆదేశం
- ఇలాంటి వ్యవహారాల్లో మేం జోక్యం చేసుకోలేం
- సమస్య మరింత జఠిలం అవుతుంది
- హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కేంద్రం ఇటీవల బదిలీ చేసిన ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టులోనూ ఊరట దక్కలేదు. క్యాట్ తీర్పును సవాల్ చేస్తూ ఏడుగురు ఐఏఎస్ అధికారులు తెలంగాణ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఐఏఎస్ అధికారులు రొనాల్డ్ రాస్, వాకాటి కరుణ, ఆమ్రపాలి కాటా, వాణీప్రసాద్, హరి కిరణ్, శివశంకర్, సృజన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మీద విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు.. క్యాట్ ఆదేశాలను సమర్థించింది. డీవోపీటీ ఉత్తర్వుల

..మిగతా 2 లో



## ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు దుర్మరణం

- మెదక్ జిల్లాలో విషాదం
- అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లిన కారు
- మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు బాలికలు, మరో వ్యక్తి
- గ్రామ దేవతను దర్శించుకొని వస్తుండగా ఘటన

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు అదుపు తప్పి శివంపేట మండలంలోని రత్నాపూర్ వాగులోకి దూసుకెళ్లడంతో విషాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. మృతుల్లో నలుగురు మహిళలు ,ఇద్దరు బాలికలు,

..మిగతా 2 లో



## రైతు సంక్షేమం కోసం తపించే పార్టీ కాంగ్రెస్

- ఎస్‌ఎల్‌బీసీలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు

..మిగతా 2 లో



## చంద్రబాబుకు ఎన్ ఎస్ జీ భద్రత కట్

- మరికొందరు కీలక మంత్రులకు కూడా..
- సీఆర్ పీఎఫ్ తో సెక్యూరిటీ ఇవ్వనున్న సర్కారు
- కేంద్ర నిర్ణయంతో తొమ్మిది మందికి కట్

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

వీఐపీ సెక్యూరిటీ విధుల నుంచి కౌంటర్ టెర్రరిస్ట్ కమండో ఫోర్స్ ఎన్ఎస్‌జీ ని దశలవారిగా ఉపసంహరించుకోవాలని కేంద్ర

..మిగతా 2 లో

## బఫర్ జోన్లో మాల్ ఉండొచ్చా?

పేదల ఇండ్లు మాత్రం ఉండొద్దా?

- నిర్మాణాలకు అనుమతులు ఎందుకిచ్చారా?
- ఇప్పుడు ఎందుకు కూలుస్తున్నారు?
- రేవంత్ మూసీ పరివాహక ప్రాంతానికి రావాలి
- నిర్వాసితులతో మాట్లాడి .. ఒప్పించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
బఫర్ జోన్‌లో మల్లయ్య ఇల్లు ఉండకూడదట.. కానీ ఇల్లు తీసేసి మాల్ కట్టొచ్చట.. అదేం లాజిక్ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. మల్లయ్య ఇంట్లో నుంచి మురికి నీరు వస్తది.. కానీ మాల్‌లో నుంచి సుగంధ ద్రవ్యం వస్తదా..? ఈ ద్వంద్వ వైఖరి ఏంటి..? అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో

..మిగతా 2 లో

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**మొదటిపేజీ తరువాయి**

మైన్‌బాయి, పద్మ, ఝాన్సీబాయిని పోలీసులు పక్కా సమాచారంతో అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఆమె భర్త కిషన్‌జీ కేంద్ర కమిటీ సభ్యుడిగా పని చేస్తున్న సమయంలో 2011లో పశ్చిమ బెంగాల్ జార్‌గ్రామ్‌లోని బురిషోల్ జరిగిన ఎదురు కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయారు. కిషన్ జీ స్వస్థలం పెద్దపల్లి జిల్లా. ఆయన సోదరుడు సైతం మావోయిస్ట్ పార్టీలో కేంద్ర కమిటీలో కొనసాగుతున్నారు.
ప్రస్తుతం ఆయన అజ్ఞాతంలో ఉన్నారు. కిషన్ జీ భార్య సుజాతక్క సైతం పార్టీ కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌లో చనిపోయినప్పటి నుంచి ఆమె కోసం వెతుకుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె వయసు 60 సంవత్సరాలు. అయితే, ఛత్తీస్‌గఢ్ సౌత్ బస్తర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో ఉంటున్నారని.. పార్టీ నిర్మాణ బాధ్యతలు చూసుకునే ఆమె ఎందుకు బయటకు వచ్చారనే విషయం తెలియరాలేదు. అయితే, వైద్య పరీక్షల కోసం మహబూబ్‌నగర్‌కు వచ్చారా? షెల్టర్ జోన్‌లో ఉంటున్నారా? అన్న సమాచారం తెలియాల్సి ఉన్నది. ఆమెను ఎప్పుడు.. ఎక్కడ ? అరెస్ట్ చేశారన్న వివరాలు సైతం వెల్లడి కావాల్సి ఉంది. సూజాతక్క క్రాంతికారీ జనతన్ సర్కారు వ్యవహారాల్లోనూ కీలక బాధ్యతలు చూస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆమెను అరెస్టుపై పోలీసు వర్గాలు అధికారిక ప్రకటన చేయలేదు.



# గ్రూప్ 1 అభ్యర్థుల నిరసన

**మొదటిపేజీ తరువాయి**

స్టేషన్‌కి తరలించారు. గ్రూప్ 1 మెయిన్ పరీక్షలకు ఇటీవల హైకోర్టు అనుమతి ఇచ్చింది. గ్రూప్ 1 నోటిఫికేషన్లు సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది.
సమయంలో ప్రిలిమ్స్‌పై దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా ఈ నెల 21 నుంచి జరుగనున్నాయి. ప్రిలిమ్స్‌లోని ఏడు ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని పిటిషనర్స్ హైకోర్టును ఆశ్రయించింది. వాటికి మార్కులు కలిపి మళ్లీ కొత్త జాబితా ఇవ్వాలని పిటిషనర్లు కోర్టును కోరారు. ప్రిలిమ్స్‌కి, రిజర్వేషన్ల జీవో 33, తదితర అంశాలపై మొత్తంగా గ్రూప్ 1పై హైకోర్టులో దాదాపు 15కిపైగా కేసులు నమోదయ్యాయి. వాటన్నింటిని కోర్టు కొట్టివేసింది. హైకోర్టు పిటిషన్లు కొట్టివేడయంతో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేస్తున్నది. రాష్ట్రవ్యాప్తంగా మెయిన్స్‌కు 31,382 మంది అభ్యర్థులు హాజరవనున్నారు.
ఈ ఏడాది జూన్ 9న జరిగిన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షను రద్దు చేయాలంటూ దాఖలైన పలు పిటిషన్లను హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. దీంతో మెయిన్స్‌కు అడ్డంకులు తొలగినట్లయింది. విచారణ సందర్భంగా.. విద్యా సంబంధిత విషయాల్లో నిపుణుల అభిప్రాయాలే కీలకంగా ఉంటాయని, వాటిని కోర్టులు తమ విచక్షణాధికారం ద్వారా పునఃస్థాపించలేవని స్పష్టం చేసింది. జోక్యం చేసుకోవడానికి అవకాశం ఉండదని తేల్చి చెప్పింది. సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్ష నిర్వహించడం చెల్లదని ప్రిలిమ్స్‌లోని ఏడు ప్రశ్నలకు తుది 'కీ'లో సరైన జవాబులు ఇవ్వలేదని, వాటికి మార్కులు కలిపి మళ్లీ జాబితా ఇవ్వాలని, పలు ప్రశ్నలను తొలగించి మళ్లీ ఫలితాలు ప్రకటించేలా ఆదేశించాలని, గ్రూప్ 1 ప్రిలిమ్స్‌ను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై జస్టిస్ పుల్ల కార్తీక్ ధర్మాసనం విచారణ చేపట్టింది. 1,721 మంది అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా 6,147 అభ్యంతరాలు వచ్చాయని, వీటిపై టీజీపీఎస్సీ సబ్జెక్టుల వారీగా ప్రఖ్యాత విద్యా సంస్థలకు ప్రొఫెసర్లతో నిపుణుల కమిటీ వేసిందని హైకోర్టు తెలిపింది. "విషయ నిపుణుల అభిప్రాయాల ఆధారంగా 56, 59 సంఖ్య కలిగిన ప్రశ్నలను తొలగించి.. 115వ ప్రశ్నకు ఆప్షన్‌ను సవరించి ఫైనల్ కీని విడుదల చేసింది. పిటిషనర్లు సమర్పించిన అభ్యంతరాలను నిపుణుల కమిటీ ఒకటికి రెండుసార్లు పరిశీలించాకే ఫైనల్ కీ ఇచ్చారని పేర్కొన్న న్యాయస్థానం అభ్యర్థుల పిటిషన్‌ను తోసిపుచ్చింది.



## రైతు సంక్షేమం కోసం తపించే పార్టీ కాంగ్రెస్

**- ఎస్ఎల్‌బీసీలో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన**
**- మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల**

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**
రైతు సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఎస్ఎల్‌బీసీ బత్తాయి మార్కెట్ యార్డులో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ..నల్లగొండ జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికంగా ధాన్యం పండుతుందని, రైతులు ధాన్యాన్ని ఎండబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసి డబ్బులు చెల్లించే ఏర్పాటు చేస్తామన్నారు.ఎస్ఎల్‌బీసీ వద్ద గతంలో బత్తాయి పండ్ల కోసం నిర్మించిన షెడ్డులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రితో విజ్ఞప్తి చేశారు. అనంతపూర్ తర్వాత నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా బత్తాయి సాగు జరుగుతుందని, సుమారు 50,000 ఎకరాలలో బత్తాయి సాగు చేస్తారని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో భాగంగా నల్గొండ జిల్లాలో 375 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, ఇందులో భాగంగా ఇప్పటి వరకే 152 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. ఈ వారం చివరి వరకు అన్ని కేంద్రాలు ప్రారంభిస్తామని, కొనుగోలు కేంద్రాలలో తేమ కొలిచే యంత్రాలు,తూకం యంత్రాలు, లారీలు, హమాలీల వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు.





## జమ్ముకశ్మీర్ సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం

**మొదటిపేజీ తరువాయి**

తొలి సీఎం అయ్యారు. శ్రీనగర్‌లోని షేర్‌ఇ కశ్మీర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఒమర్ అబ్దుల్లాతో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి కరుణానిధి, ఆప్ నేత సంజయ్ సింగ్, ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఐ నేత డీ రాజా హాజరయ్యారు.ఒమర్ అబ్దుల్లాతో పాటు మరో ఐదుగురు మంత్రులు ప్రమాణస్వీకారం చేశారు. ఉపముఖ్యమంత్రిగా సురీంద్ర కుమార్ చౌదరీ బాధ్యతలు చేపట్టారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ నుంచి గెలుపొందిన ఆరుగురు నేతలు ఎవరూ ప్రమాణస్వీకారం చేయడం లేదని జమ్ముకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ తారిఖ్ హమీద్ కర్రా వెల్లడించారు. 'ప్రస్తుతానికి మేం జమ్మూకశ్మీర్‌లోని నూతన ప్రభుత్వంలో చేరడం లేదు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కాంగ్రెస్ బలంగా డిమాండ్ చేసింది. కానీ, అది ఇంతవరకు అది జరగలేదు. అసంతృప్తిగా ఉన్నాం. ఈ విషయంలో మా పోరాటాన్ని కొనసాగిస్తాం'అని హమీద్ పేర్కొన్నారు.మరోవైపు చాలా కాలం తర్వాత జమ్ముకశ్మీర్లో స్థిరతమైన ప్రభుత్వం వచ్చినందకు సంతోషంగా ఉందని పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ అన్నారు. కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్రజల సమస్యలను, బాధలను పరిష్కరిస్తుందని తెలిపారు. 2019 ఆగస్టు 5న కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఖండిస్తూ ఒక తీర్మానం కొత్త ప్రభుత్వం తీసుకొస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. వాటితో పాటు నిరుద్యోగం, డ్రగ్స్, విద్యుత్ వంటి ప్రధాన సమస్యలను అధిగమించేందుకు మార్గాలను కనుగొంటుందని అన్నారు. ప్రజలకు అసౌకర్యం కలకకుండా ఉండేందుకు తాను రోడ్డు మార్గంలో వెళ్లే సమయంలో గ్రీన్ కారిడార్ ఉండదని ఒమర్ అబ్దుల్లా తెలిపారు. తను ప్రయాణిస్తున్నప్పుడు ట్రాఫిక్కు నిలిపివేయడం వంటి మానుకోవాలని పోలీసులుకు సూచించినట్లు చెప్పారు. సైరన్ల వినియోగాన్ని తగ్గించాలని నిర్దేశించినట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముందు తన తాత షేక్ మహ్మద్ అబ్దుల్లాకు ఒమర్ అబ్దుల్లా నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వ సహకారంతో పనిచేయడానికి ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అయితే ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సొంత హక్కు ఉంది. నాకు విచిత్రమైన అనుభవాలు ఉన్నాయి. ఆరేళ్ల పదవీకాలం పూర్తి చేసిన చివరి ముఖ్యమంత్రిని నేనే. ఇప్పుడు కేంద్రపాలిత ప్రాంతానికి తొలి సీఎం. రాష్ట్ర హోదాను పునరుద్ధరించడం ద్వారా మా పాలన మొదలవుతుంది' అని ఒమర్ అబ్దుల్లా తెలిపారు.
ఇటీవల జరిగిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమి విజయం సాధించాయి. మొత్తం 90 సీట్లగాను ఎన్సీ 42 స్థానాల్లో గెలుపొందగా, కాంగ్రెస్ ఆరు నియోజకవర్గాల్లో విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజార్టీ వచ్చింది. ఈ క్రమంలోనే ఎన్‌సీ శాసనసభాపక్ష నేతగా ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బఫర్ జోన్లో మాల్ ఉండొచ్చా?

**మొదటిపేజీ తరువాయి**

జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బఫర్ జోన్లలో ఉన్న నిర్మాణాలకు మీరే కదా అనుతులు ఇచ్చింది. రిజిస్ట్రేషన్లు చేసింది మీరే కదా..! ఇప్పుడు వాటిని కూలగొడితే రిజిస్ట్రేషన్ డబ్బులు రేవంత్ రెడ్డి తిరిగి ఇస్తాడా..? జీవో ఇచ్చాం పోండి అంటే ఎలా..? ఏ చర్చ లేకుండా, అనాలోచితంగా చేస్తామంటే ప్రజలు ఊరుకోరు. మూసీ పరివాహక ప్రాంతానికి రా.. వాళ్ల ముందు పబ్లిక్ మీటింగ్ పెట్టి చెప్పు.. ఎలా మూసీ సుందరీకరణ చేస్తావు..? ఎలా అభివృద్ధి చేస్తావో చెప్పు..? ప్రజలను ఒప్పించి మెప్పించు అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. పాలన చేతగాక ఈ మాటలు.. ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీసులకు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులకు, గురుకుల భవనాలకు కిరాయిలు, తులం బంగారం ఇచ్చేందుకు, పెన్షన్లు, రుణమాఫీకి పైసల్లేవు. కానీ మూసీని లక్షా యాభై వేల కోట్లతో సుందరీకరణ చేస్తామంటున్నారు. వరద సహాయం చేస్తామన్నారు.. ఒక్క రూపాయి సహాయం చేశారా..? నెలన్నర అయింది. ఖమ్మం, మహబుబాబాద్‌లోని వరద బాధితులకు వారి ఖాతాల్లో రూ. 17500 వేస్తామన్నారు. వేశారా..? నీ ప్రాధాన్యత ఏంది.. పేద ప్రజల.. నీ ఖజానా నింపుకోవడమా..? ఢిల్లీ పెద్దలకు, మహారాష్ట్ర ఎన్నికలకు డబ్బులు పంపడమే నీ పనా..? పేద ప్రజలను ఒప్పించకుండా మీ ఇష్టారీతిన పోతామంటే ప్రజల తరపున నిలబడి ఉంటాం. హడావుడి చేసి పేద ప్రజల హక్కులకు భంగం కలిగిస్తామంటే ఊరుకోం.. ప్రజల పక్షాన పోరాడుతాం అని కేటీఆర్ తేల్చిచెప్పారు.



## ఐఏఎస్ లకు హైకోర్టులోనూ నిరాశే

**మొదటిపేజీ తరువాయి**

ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఐఏఎస్ అధికారులు దాఖలు చేసిన పిటిషన్లను డిస్మిస్ చేసింది. లంచ్ మోషన్ పిటిషన్ విచారణ సందర్భంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రజాసేవ కోసమే ఐఏఎస్‌లు ఉన్నారన్న హైకోర్టు.. కేంద్రం ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లాలని సూచించింది. ట్రిబ్యునల్ పిటిషన్ కొట్టేసిందని కోర్టులకు రావడం కరెక్ట్ కాదని పేర్కొంది. మరోవైపు క్యాట్ లో నవంబర్ నాలుగో తేదీన విచారణ ఉందన్న ఐఏఎస్ అధికారుల తరుపు న్యాయవాది.. ఈ పదిహేను రోజుల పాటు రిలీవ్ చేయవద్దని కోరారు. అయితే స్టే ఇస్తూ పోతే ఈ వ్యవహారం ఎప్పటికీ తేలదన్న హైకోర్టు.. క్యాట్ లోనూ సీనియర్ అధికారులు ఉంటారని పేర్కొంది. ఇలాంటి వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే సమస్య మరింత జఠిలం అవుతుందని హైకోర్టు అభిప్రాయపడింది. క్యాట్ ఆదేశాలను సమర్థిస్తూ ఐఏఎస్ అధికారుల పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. ఐఏఎస్ అధికారులు వెంటనే డీవోపీటీ కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్టు చేయాలని హైకోర్టు సూచించింది. బాధ్యతాయుతమైన అధికారులుగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వారిపై ఉందని అభిప్రాయపడింది. మరోవైపు డీవోపీటీ ఉత్తర్వుల ప్రకారం అక్టోబర్ 16 అంటే ఇవాళ సాయంత్రంలోగా వారంతా వారి సొంత రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. క్యాట్ సైతం ఇదే ఆదేశాలు ఇచ్చింది. అయితే క్యాట్ ఆదేశాలను సవాల్ చేస్తూ వీరంతా హైకోర్టును ఆశ్రయించగా.. అక్కడ కూడా ఊరట దక్కలేదు. క్యాట్ ఆదేశాలను సమర్థిస్తూ హైకోర్టు వీరి పిటిషన్ డిస్మిస్ చేసింది.

## చంద్రబాబుకు ఎన్ ఎస్ జీ భద్రత కట్

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్ఎస్‌జీ స్థానే ఆ బాధ్యతలను సీఆర్‌పీఎఫ్‌కు అప్పగించనుంది. రెండు నెలల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు బుధవారంనాడు తెలిపాయి. కేంద్రం నిర్ణయంతో తొమ్మిది మంది "జడ్‌ప్లస్'' కేటగిరి వీఐపీలకు ఇస్తున్న ఎన్ఎస్‌జీ భద్రతను ఇక నుంచి సీఆర్‌పీఎఫ్ చేపడుతుంది.
'జడ్ ప్లస్' కేటగిరిలోని 9 మంది ప్రముఖులు వీరే...
ఎన్ఎస్‌జీకి చెందిన 'బ్లాక్ క్యాట్' కమెండోలతో 'జడ్ ప్లస్' కేటగిరి భద్రతలో ఉన్న తొమ్మిది మందిలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, బీఎస్‌పీ అధినేత్రి మాయావతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్.కె.అద్వాణి, కేంద్ర షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, బీజేపీ నేత, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, డీపీఏపీ అధ్యక్షుడు గులాం నబీ ఆజాద్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఉన్నారు. వీరికి ప్రస్తుతం ఎన్ఎస్‌జీ భద్రత ఉండగా, ఆస్థానే సీఆర్‌పీఎఫ్ భద్రత కల్పించనున్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు దుర్మరణం

**మొదటిపేజీ తరువాయి**

ఓ వ్యక్తి ఉన్నాడు. మృతులను రత్నాపూర్, తాళ్లపల్లి, పాము తండా వాసులుగా భావిస్తున్నారు. కారు అదుపుతప్పి కల్వర్టను ఢీకొని కాలువలో పడిపోవడంతో తీవ్ర ప్రాణనష్టం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. పాముబండ తండాకు చెందిన వారు కారులో వెళ్తున్నారు. రోడ్డుపై గుంత రావడంతో కారు ఒక్కసారిగా అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టి, పక్కనే ఉన్న కాల్వలో పడిపోయింది. నీట మునిగి ఈ ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తుప్రాన్ దగ్గర గ్రామ దేవతను దర్శించుకుని ఇంటికి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదం గురించి తెలియగానే సమీప ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో అక్కడికి వచ్చారు. స్థానికుల సహాయంతో గజ ఈగతగాళ్లు మృతదేహాలను బయటకు తీశారు. వారి బంధువులు అక్కడికి చేరుకని కన్నీటి పర్యంతమయ్యారు. వారిని ఓదార్చడం అక్కడున్న వారి వల్ల కాలేదు. గుండె బరువెక్కించే ఈ ఘటన స్థానికుల్ని సైతం కలచివేసింది.

**సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు దిగ్భ్రాంతి**

మెదక్ జిల్లా శివంపేట మండలం ఉసిరికపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కారు వాగులో పడిన ప్రమాదంలో పాముబండ తండాకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు హరీష్ రావు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టి, వారిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గాయపడిన వారికి తక్షణం వైద్య సాయం అందించాలన్నారు.



# గార్బ్వ వేడుకలో పాల్గొన్న బండి

**- కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రమేష్**

**కూకట్ పల్లి, విశాలభారతి:** అల్లపూర్ ఆర్కే సొసైటీ లోని దర్గాలో గార్బ్వ పర్వదినాన్ని పురస్కరించుకొని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శేరిసతీష్ రెడ్డి లు వేడుకల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫనింద్ర కుమార్ డివిజన్ ప్రెసిడెంట్ మోహినుద్దీన్,జమీర్ భాయ్,కరిమబ్దుల్లా,మస్తాన్ రెడ్డి, కనకయ్య ముదిరాజ్,ఖలీల్,మొయిజ్ భాయ్, షబ్బీర్,యూసుఫ్,టెంట్ హౌస్ గౌస్, నజీర్,జహంగీర్,గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.





# అమ్మవారు శాంతింతాలని మౌనదీక్ష

- **కొంతం దీపిక**
- **ముత్యాలమ్మ దేవాలయంలో వేపనీళ్లతో శాఖ**

**విశాలభారతి,కంటోన్మెంట్:** ధర్మబద్ధంగా ఆగమ శాస్త్ర బద్ధంగా కుమ్మరిగూడలో ముత్యాలమ్మ దేవాలయం లో బస్తివాసులతో,దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి కలశస్థాపన, శాంతి చండీ హోమము నిర్వహించినట్లు స్థానిక కార్పోరేటర్ కొంతం దీపిక స్పష్టం చేశారు. అమ్మవారు శాంతించాలని దేవాలయం ముందు రెండు గంటల పాటు బస్తీ వాసులతో కలిసి మౌన దీక్ష చేపట్టినట్లు ఆమె వివరించారు.మరోవైపు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వేద పండితులు అమ్మవారిని శాంతిపరచడానికి అమ్మవారి ఆలయాలలో శుక్రవారం నుండి వేపనీళ్లతో శాఖను సమర్పించడం శ్రేష్టమని పూజారులు తెలియజేశారు.మరోవైపు స్థానిక బస్తీకి ప్రజలకు ఎటువంటి అరిష్టం కలగకుండా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక హిందూ సమాజము అందరూ కూడా చల్లగా ఉండాలని, ధర్మాన్ని కాపాడుకునే శక్తి హిందూ సమాజానికి ఇవ్వాలని భక్తులు దేవాలయంలో పూజలు నిర్వహించారు.ఈ శుక్రవారం రోజు భక్తులు వారి వారి ఇంటి వద్ద ఉన్నఅమ్మవారికి స్థానిక మహిళా భక్తులు శాఖను సమర్పించాలని సూచించారు. అదే విధంగా కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయంకు చేరుకుని అమ్మవారికి శాఖ సమర్పించడంతో అందరిని చల్లగా చూస్తుందని భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ వంశాతిలక్, బస్తీవాసులు, భక్తులు, తదితరలు పాల్గొన్నారు.



# పీర్జాదిగూడలో సమీకృత వ్యర్థాల శుద్ధికరణ డంపింగ్ యార్డ్ సందర్శన

**మేడిపల్లి, విశాలభారతి:** పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సమీకృత వ్యర్థాల శుద్ధీకరణ డంప్ యార్డ్ సందర్శనలో మేయర్ అమర్ సింగ్, కమిషనర్ తిల్లేశ్వరరావు, ఐటీసీ మరియు మిట్సులో & కో. ఎల్. టీ.డి .ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్శనలో కార్పొరేటర్ పిట్టల మల్లేష్,సీనియర్ నాయకులు ఈశ్వర్ రెడ్డి, యాసారం మహేష్,జపాన్ మిట్స్ లో & కోఎల్ టీడి జనరల్ మేనేజర్ యైత సాన్ ,అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మహాదని సాయికేత్ (ఢిల్లీ ),ఐటీసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్ ఉమకంత్ మరియు ఐటీసీ.ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ కిషోర్ గౌడ్ పాల్గొన్నారు. మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ..పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సమీకృత వ్యర్థాల శుద్ధీకరణకు సంబంధించిన ప్రాధాన్యతను మరియు స్వచ్ఛతకు సంబంధించిన ప్రాముఖ్యతను వివరించారు. స్వచ్ఛ పీర్జాదిగూడ నగరంగా నిర్మాణంలో తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు.



# కులగణనను స్వాగతిస్తున్నాం

- **ఓయూ ఎస్సీ,ఎస్టీ,బీసీ సంఘాలు.**
- **స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్స్ కల్పించాలి**
- **జాజుల లింగంగౌడ్**

**సికింద్రాబాద్ ,విశాలభారతి:** రాష్ట్రంలో సమగ్ర కులగణన ప్రక్రియ ప్రారంభిస్తున్న సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలోని పూలే అంబేద్కర్ స్టడీ సెంటర్ లో సామాజిక సంఘ సంస్కర్తలైన మహాత్మ జ్యోతిబాపూలే, డా.బి.అర్ అంబేద్కర్ విగ్రహలకు ఎస్సీ,ఎస్టీ, బీసీ సంఘాల అధ్వర్యంలో పూలాభిషేకాలు చేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన ప్రక్రియను ప్రారంభించి, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని గత ఆరు నెలలుగా ఎన్నో ఉద్యమాలు,పోరాటాలు చేయడం జరిగిందని చివరకు బీసీ సంఘం తరఫున హైకోర్టులో కేసు కూడా వేయడం జరిగిందన్నారు. దీని ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 18 విడుదల చేసిందన్నారు. యావత్ బీసీ సమాజం తరపున కాంగ్రెస్ ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరియు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఇది బీసీల పోరాట విజయంగా భావిస్తున్నాం.కులగణను అడ్డుకోవాలని చూస్తే వాళ్ళ భరతం పడతామని అన్నారు.కులగణన పై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు.ఈ కులగణన ప్రక్రియ న్యాయపరమైన చిక్కులు ఏర్పడకుండా, ఎలాంటి అవరోధాలు లేకుండా కులగణన జరిగి బీసీలకు అన్ని రంగాల్లో సమాన వాటా దక్కేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ ప్రెసిడెంట్ నామ సైదులు తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు విజయనాయక్ ఉస్మానియా యూనివర్సిటీ బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ ఏం.వి భాను కృష్ణ,సంతోష్ , అశోక్ కుమార్,విజయ్ కుమార్ ,రవి నాయక్ పాల్గొన్నారు.

# పెండింగ్ రియంబర్స్మెంట్ ను విడుదల చేయాలి

- **ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ దొంతగోని శివ కృష్ణ**



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** పెండింగ్ లో ఉన్న రూ . 7500 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్ , స్కాలర్షిప్స్ వెంటనే విడుదల చేయాలనీ ఏబీవీపీ వీరపట్నం జిల్లా కన్వీనర్ దొంతగోని శివ కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు రూ. 7500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థులకు విద్యను దూరం చేస్తుందని మండిపడ్డాడు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరినీ సమన్వయం చేసుకొని పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




# కార్మికులకు పౌష్టికాహారంపై అవగాహన తప్పనిసరి

- **కూకట్పల్లి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ ఐఏఎస్**

**కూకట్ పల్లి, విశాలభారతి:** పౌష్టికా పోష కాహారం పై జిహెచ్ఎంసి కార్మికులకు తప్పనిసరి అవగాహన ఉండాలని కూకట్పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహన్ అన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నాడు కూకట్ పల్లి నియోజకవర్గం పరిధి లోని పర్వత్ నగర్, మినీ ఫంక్షన్ హాల్ లో 9వ వైద్య ముగింపు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అపుర్వ్ చౌహాన్(ఐఏఎస్) జోనల్ కమిషనర్ మాట్లాడుతూ ఈఎస్ఐ, ఎన్ఐఎన్, సిఎన్ ఆర్ కార్మికులకు అవగాహన కార్యక్రమం తో పాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పౌష్టికాహారం ఆరోగ్యం పైన అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేసినందుకు వైద్యులకు ధన్యవాదాలు తెలిపి సన్మానం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో దాదాపు 2400 మంది కార్మికులు అందులో 1030 కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కూకట్పల్లి జోన్ , NIN అధికారులు ESI డాక్టర్ లు, ఉప కమిషనర్, మూసాపేట్ , రమేశ్, కార్తీక్, ఏఎంఓ హెగచ్, మూసాపేట్, నోడల్ ఆఫీసర్ AMC కె. శ్రీకాంత రెడ్డి, జామీల్,ఎస్ఎస్ పాల్గొన్నారు.



# పేదల ఇళ్లు కూల్చి.. బిల్డర్లను భయపెడుతున్నారు..

- **రేవంత్‌రెడ్డిది అసమర్థ పాలన**
- **మూసీ సుందరీకరణ వెనుక భారీ స్కాం**
- **పేదలకు మద్దతుగా బీఆర్ఎస్ పర్యటనలు**
- **గ్రేటర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్**

**విశాల భారతి, హైదరాబాద్:**
పేదల ఇళ్లుకూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. 'అక్రమ నిర్మాణమైతే.. నా ఫాంహౌస్‌ను కూల్చేయండి.. ఉన్నవాళ్ల ఇళ్లను కూల్చండి.. తప్ప.. హైడ్రా పేరుతో పేదల ఇళ్లుకూల్చి వారిని రోడ్డుపాలు చేయొద్దు' అని అన్నారు.

**భయపెట్టి డబ్బు వసూళ్లు..**

పేదల ఇళ్లుకూల్చి.. బిల్డర్లు, వ్యాపారవేత్తలను భయపెట్టి డబ్బు వసూళ్ల కోసమే రేవంత్ సర్కార్ హైడ్రా తెచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పేదలకు తాము అండగా ఉంటామని, క్షేత్రస్థాయిలో పర్యటించి.. బస్తీలు, కాలనీల్లోని వారి భరోసా కల్పిస్తామన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమ

**రేవంత్ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నరు..**

వికారాబాద్ జిల్లాలో రేడార్ స్టేషన్ పనులకు శంకుస్థాపన సందర్భంగా జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డిచేసిన ప్రసంగం ఆశ్చర్యం కలిగించిందని కేటీఆర్ అన్నారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రేనా? లేక బీజేపీలో ఉన్నారా? అర్థం కావడంలేదన్నారు. ఉన్నట్టుండి ఆయనకు దేశరక్షణ గుర్తొచ్చిందని, గతంలో ఆయన ఆర్మీలో ఏమైనా పనిచేశారా? అంటూ ఎద్దేవా చేశారు. రేడార్ స్టేషన్‌తో స్థానికులకు ఒక్క ఉద్యోగం కూడా రాదని.. పర్యావరణానికి నష్టం కలిగించే ఆ ప్రాజెక్టుకు అనుమతి ఇవ్వడం తగదన్నారు. పర్యావరణ హితం కోసమే.. నేవీ రేడార్ స్టేషన్ ఏర్పాటుకు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా.. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థలం కేటాయించలేదన్నారు.

**ఇద్దరు ఎమ్మెల్యేలు డుమ్మా..**

ఇదిలా ఉండగా.. కేటీఆర్ నిర్వహించిన సమావేశానికి ఇద్దరు ఎమ్మెల్యేలు పద్మారావుగౌడ్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరు కాలేదు. మరోవైపు.. అధికారం చేపట్టిన పది నెలల్లోనే రేవంత్‌రెడ్డి.. రికార్డు స్థాయిలో రూ.80,500 కోట్ల అప్పులు చేశారని, ఆ డబ్బులను ఏంచేశారని నిలదీశారు. కొత్తగా సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు.. ఎన్నికల హామీలు తీర్చలేదు. తెచ్చిన అప్పు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి.. అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.



# నలుగురిపై పిచ్చి కుక్క దాడి

**భీమదేవరపల్లి, విశాల భారతి** మండలంలోని ముల్కనూర్ మార్కెట్ సమీపంలో నలుగురుపై పిచ్చికుక్కలు దాడి చేశాయి. తీవ్రగాయాలతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు మాట్లాడుతూ అక్కడ మాంస వ్యాపారస్తులు చికెన్ వ్యర్థాలను సమీపంలో పడవేయడంతో కుక్కలు గుంపులు గుంపులుగా స్వైరవిహారం చేస్తూ బాటసారులు, వాహన చోదకులపై దాడి చేస్తున్నాయన్నారు.ఈ విషయంలో అధికారులు శ్రద్ధ తీసుకొని, వీధి కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రభుత్వ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో ఎంపిక



**కూకట్ పల్లి విశాలభారతి:** బ్యాడ్మింటన్ పోటీల్లో తనదైన శైలిలో కూకట్ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి పెండ్యాల అభిరాజ్ దూసుకెళ్తున్నాడు. ఇటీవల జరిగిన మేడ్చల్,మల్కాజిగిరి జిల్లాల్లో జిల్లా స్థాయి అండర్ 19 బ్యాడ్మింటన్ పోటీల్లో పలు కళాశాల క్రీడాకారులతో తలపడి రెండవ స్థానం లో నిలిచాడు. రానున్న రాష్ట్రా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. దీంతో కూకట్పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తనలో ఉన్నదాగివున్న ప్రతిభను వెలికి తీసి ముందుకెళ్లాలన్నారు. టాలెంట్ ఉన్న విద్యార్థులు వచ్చిన అవకాశాలను దక్కించుకొని తమ గమ్యాలను స్థానాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కళాశాలలోనే నిర్ణయించబడుతుందని ప్రతిభ గల విద్యార్థులకు ప్రభుత్వాలు కళాశాల సిబ్బంది చాలరకాల అవసరమైన సౌకర్యాలు అందుబాటులో ఉంటున్నాయని వాటిని వినియెగించుకోవలని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్,అధ్యాపకులు, అభిరాజ్ ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.



# ఆల్ సోల్స్ డే కోసం ఏర్పాట్లు చేయాలి

- **రవీందర్ గుప్త విజ్ఞప్తి**
- **కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ కు వినతిపత్రం**

**విశాలభారతి,కంటోన్మెంట్:** కంటోన్మెంట్ నియోజికవర్గంలో క్రైస్తవులు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. వారు నిర్వహించుకునే పండుగల్లో ఒకటి ఆల్ సోర్స్ డే అని స్థానిక నాయకుడు రవీందర్ గుప్తా తెలిపారు. ఈ ఏడాది నియోజికవర్గంలో నిర్వహించే ఆల్ సోల్స్ డే సందర్భంగా కంటోన్మెంట్ నియోజికవర్గంలోని ఏడో వార్డులో ఉన్న క్యాథలిక్ శ్మశానవాటికలో లైట్లు ఏర్పాటు చేయాలని కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ కు వినతీపత్రం అందజేశారు. మరోవైపు శ్మశానవాటిలో పెరిగిన చెట్లు, చెత్తను తొలగించాలి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేత రవీందర్ గుప్తా తోపాటు వారి బృందం జార్జ్ విన్సెంట్ ,రాజు శర్మ, వినోద్, గోపి, సురేష్ పాల్గొన్నారు.



# ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**భీమదేవరపల్లి,విశాలభారతి** ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబర్చలని వంగర ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రుబీనా అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని కేజీబీవి బాలికల పాఠశాలలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేశారు. వ్యక్తిగత శుభ్రత పై సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెహమాన్ ఉపాధ్యాయ , ఆశ ఏఎన్ఎం లు ఉన్నారు.



## నేత్రధాత సంస్మరణ సభ.. నేత్ర దానం పై అవగాహన

**సైదాపూర్, విశాల భారతి** కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లి గ్రామనికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఠాకూర్ రమేష్‌సింగ్ అక్టోబర్ 6 2024న మృతి చెందగా సమాజ హితం కోరి కుటుంబ సభ్యులు భార్య మంజుల,కుమార్తెలు అర్చన, అఖిల, అన్వితల సహకారంతో నేత్రదానం చేసి ఇద్దరి అందులకు చూపునిచ్చారు. నేత్ర వైద్య విద్య కు తోడ్పడినారు. బుధవారం ఇంటి యందు దశదిన కర్మకాండ కార్యక్రమం అనంతరం తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించి, గొప్ప త్యాగం చేసిన కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి నేత్రదాన అభినందన పత్రం అందజేసి ప్రత్యేక ధన్యవాదములు తెలుపారు. దశదిన కార్యక్రమమునకు వచ్చిన బంధు మిత్రులందరికీ నేత్ర దానంపై అవగాహన కల్పించారు. మనమందరం కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని, మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానం చేసి సమాజానికి తోడ్పడుదాం అని అసోసియేషన్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. ఎవరైనా అవయవ దానం చేయాలనుకునేవారు 8790548706, 9441454286, సెల్ నెంబర్ సంప్రదించాలాన్నారు. ఈ కార్యక్రమంలో బంధుమిత్రులు అసోసియేషన్ అధ్యక్షులు కె మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి కే శంకర్రావు యాదవ్, శ్రీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గాడి తప్పతున్న గ్రామ పాలన

- రెండు గ్రామాలకు ఒక్కరే సెక్రటరీ
- చుట్టపు చూపుగా వస్తున్న కార్యదర్శి
- పర్మినెంట్ గా పంచాయతీ కార్యదర్శిని నియమించాలని గ్రామస్థుల డిమాండ్




**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** గ్రామాల్లో పంచాయతీ పాలన పడకేసింది. ఒక్కో పంచాయతీ కార్యదర్శికి రెండు , మూడు పంచాయతీల బాధ్యతలను అప్పగించడం, వారు చుట్టపు చూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారిపోయింది. సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు, అభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రణాళిక లేకపోవడం, పారిశుధ్య పనులకు పర్యవేక్షణ కొరవడడంతో ప్రజలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారు. యాచారం మండలంలోనే నందివనపర్తి పెద్ద గ్రామ పంచాయతీ అలాంటిది పంచాయతీ కార్యదర్శి ఇదివరకు శ్యామ్ సుందర్ రెడ్డి విధులు నిర్వర్తిస్తూ ఇటీవలే వేరొక చోటుకి డిప్యూటేషన్ పై వెళ్ళారు. ప్రస్తుతం మాల్ పంచాయతీ కార్యదర్శి రాజు నందివనపర్తి గ్రామానికి ఇంచార్జీ గా బాధ్యతలు చేపట్టారు. అటు , ఇటు రెండు గ్రామ పంచాయతీ లు కూడా పెద్దది కావడంతో కార్యదర్శికి తలకు మించిన భారం అవుతుంది. గత కొంతకాలంగా నందివనపర్తి లో త్రాగు నీటి సమస్య తెర పైకి వచ్చింది. అధికారులు లేకపోవడంతో ఎవరికి చెప్పాలో అర్ధం కాలేని పరిస్థితి లో గ్రామస్థులు ఉన్నారు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు కల్పించుకొని గ్రామానికి పర్మినెంట్ గా పంచాయతీ కార్యదర్శి నీ పెట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపం..**

ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో ఎక్కడిక్కడ సమస్యలు పేరుకుపోతున్నాయి. పారిశుధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వారానికి ఒకటి, రెండు సార్లు త్రాగునీరు వస్తున్న సరిపోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. గ్రామాల్లో స్ట్రీట్ లైట్లు పాడై పోయినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది పనితనం బాగున్న పై అధికారుల పర్యవేక్షణ లోపంతో సమస్యలు పరిష్కారం కావడంలేదు.



**గ్రామానికి సెక్రటరీని నియమించాలి...**


గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఏర్పడిన పరిష్కారం కోసం ఎక్కడికి వెళ్ళాలో అర్థం కావడం లేదు. మండలంలోనే పెద్ద గ్రామ పంచాయతీ దానికి తోడు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఎక్కడో ఒక చోట రోజుకో సమస్యలు వస్తుంటాయి. ఇంచార్జ్ సెక్రటరీనీ పెట్టిన ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియడం లేదు. అధికారులు పట్టించుకోని పర్మినెంట్ గా పంచాయతీ కార్యదర్శినీ నియమించాలి.

**సామ సంతోష్ , నందివనపర్తి గ్రామస్తుడు**



## సైబర్ నేరాలపై కళాజాత

**భీమదేవరపల్లి, విశాల భారతి** మండల కేంద్రంలోని ముల్కనూర్ లో చింతల్ బస్టాండ్ వద్ద బుధవారం పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ జాగృతి కళాబృందం వారిచే కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మోసాలు గురించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో పాటు బాల్య వివాహాలు,చదువు ప్రాముఖ్యత, చెడు అలవాట్లు, మంచి అలవాట్లు, మహిళా భద్రత గురించి వివరించారు. అనంతరం ఎస్సై సాయిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు కానిస్టేబుల్స్ శోభన్ బాబు రవి నాగమణి వెంకటేశ్వర్లు రత్నయ్య శ్రీనివాస్ నారాయణ విక్రమ్ రాజు చిరంజీవి గ్రామస్తులు పాల్గొన్నారు.




## 21 నుంచి 24 వరకు
## గీతంలో సైబర్ సెక్యూరిటీ వారోత్సవం

**పటాన్ చెరు,విశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 24 వరకు 'సైబర్ సెక్యూరిటీ వారోత్సవం 2024'ను బెంగళూరులోని వేమన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సహకారంతో నిర్వహించనున్నారు. బెంగళూరులోని సైబర్ సెక్యూరిటీ ఎస్టీసీ, ఐ ట్రిపుల్ ఈ కంప్యూటర్ సొసైటీల సౌజన్యంతో, వేగంగా అభివృద్ధి చెందుతున్న సైబర్ సెక్యూరిటీ రంగంలో విద్యార్థుల జ్ఞానం, నైపుణ్యాలను పెంపొందించడం లక్ష్యంగా నిర్దేశించు కున్నట్టు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ నిరంజన్ అప్పస్వామి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. అక్టోబర్ 21న ప్రారంభోత్స వేడుకతో ఆరంభమవుతుందని, ఆ తరువాత హైదరాబాద్‌లోని హిటాచీ ఇండియాకు చెందిన విశాల్ కల్లా 'సైబర్ భద్రతా చర్యలు: డిజిటల్ యుగం కోసం పరిశ్రమ అంతర్ద ష్టులు, పరిష్కారాలు' అనే అంశంపై స్ఫూర్తిదాయక కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. అదే సమయంలో, గురురాజ్ దేశ్‌పాండే వేమన ఇన్‌స్టిట్యూట్లో 'చిన్న బగ్‌ల నుంచి ప్రధాన ఉల్లంఘనల వరకు: సైబర్ దాడి కథనాలు' అనే అంశంపై ప్రసంగించి, వాస్తవ ప్రపంచ సైబర్ సెక్యూరిటీ సవాళ్లపై లోతైన అవగాహనను కల్పిస్తారన్నారు. అదే రోజు మధ్యాహ్నం 'బిగ్ సైబర్ ఇన్ఫర్మేటిక్స్'పై ఫోరెన్సిక్ కార్యశాలను ప్రొఫెసర్ ఎస్.దిలీప్ నిర్వహిస్తారని డాక్టర్ నిరంజన్ తెలియజేశారు. అక్టోబర్ 22న, 'సెక్యూర్ ఐడియాథాన్' పేరిట పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు పురస్కారాలను అందజేస్తారని, దీనికి ఎటువంటి రుసుము లేదని, అయితే పేర్ల నమోదు తప్పనిసరని అన్నారు. ఇక ఈ వారోత్సవాలకే తలమానికం లాంటి 'సెక్యూర్ హాక్' పేరిట 24 గంటల హ్యాకథాన్ అక్టోబర్ 23న ఉదయం 10 గంటలకు ప్రారంభమై, మరునాడు రాత్రి 12 గంటలకు ముగుస్తుందని తెలిపారు. విజేతలకు ఆకర్షణీయమైన నగదు పురస్కారాలుంటాయని, ఐ ట్రిపుల్ ఈ జట్లకు నామమాత్రపు (రూ.70) రుసుము, ఇతరులు రూ.100 చెల్లించి తమ జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సైబర్ భద్రత యొక్క సంక్లిష్టతలపై అవగాహన ఏర్పరచడానికి, తరువాతి తరం సైబర్ సెక్యూరిటీ నిపుణులను ప్రేరేపించడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలను విద్యార్థులకు సమకూర్చడం లక్ష్యంగా దీనిని నిర్వహిస్తున్నట్టు డాక్టర్ నిరంజన్ వివరించారు. ఆసక్తి గలవారు తమ పేర్ల నమోదు, ఇతర వివరాల కోసం https://linktr.ee/homepage.cyberweek లింక్‌ను సందర్శించాలని, లేదా 81230 33210ను సంప్రదించాలని సూచించారు.



## 'సీపీఎం బలోపేతమే ధ్యేయం'

- సీపీఎం ఎన్ఎస్ఆర్ కాలనీ కార్యదర్శిగా ఆశీర్వాదం ఎన్నిక'

**తుర్కయంజాల్, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ పరిధిలోని నీలం సంజీవరెడ్డి నగర్ (ఎన్ఎస్ఆర్) కాలనీ సీపీఎం శాఖ 6వ మహాసభలు ఘనంగా నిర్వహించారు. నూతన శాఖ కార్యదర్శిగా జంగిలి ఆశీర్వాదం, సభ్యులుగా కొండిగారి శంకర్, నిమ్మ లక్ష్మయ్య, నక్కల్ల యాదగిరి, ఎం. చిన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య మాట్లాడుతూ పార్టీ ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లేందుకు నూతన కమిటీ పని చేయాలని సూచించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తుర్కయంజాల్ ప్రాంతంలో భూముల రేట్లు విపరీతంగా పెరగడంతో కొందరు రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను, ఎఫ్టిఎల్, బఫర్ జోన్, ఆయా కాలనీలో ఉన్నటువంటి పార్కు స్థలాలను కబ్జా చేస్తున్నారని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న పేద ప్రజలందరికీ పింఛన్లు అర్హులైన వారందరికీ ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అర్హులైన వారికి పకడ్బందీగా అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. లేని పక్షంలో ప్రజల తరపున సీపీఎం అండగా నిలబడి పోరాటాల నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మున్సిపల్ బాధ్యులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు డి.కిషన్ నాయకులు ఎం.సత్యనారాయణ, కె.శారద, కొండిగారి శంకర్, నక్కల్ల యాదగిరి, నిమ్మ లక్ష్మయ్య, ఎం.చిన్న, కె. వెంకట కృష్ణ, పి.శ్రీను, డి. శ్రీధర్, కుమార్, అశోక్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



## యువకులు విద్యార్థులు మత్తుకు బానిస కావద్దు

- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్సై తిరుపతి

**సైదాపూర్ విశాల భారతి** యువకులు విద్యార్థులు మత్తు మైకంలో ఏమ్ చేస్తారో తెలియదు. సమాజంలో మత్తు ప్రభావం తీవ్రంగా ఉంటుందని సైదాపూర్ ఎస్సై చదువాల తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెన్కేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి విలువైన సమయాన్ని మత్తు మైకంలో బానిస కావద్దన్నారు. అత్యంత ముఖ్యమైన మత్తు బానిసత్వానికి దూరంగా ఉండాలనీ చాలా చోట్ల విద్యా దశలోనే పాఠశాలలు, కళాశాలల్లో ఇటీవల గాంజాను అలవాటు అవుతున్నారని మత్తుకు బానిసగా మారితే అలవాటును మార్చుకోలేరనీ వివరించారు. అందుకే బానిస కాకూడదనీ ఉన్నత భవిష్యత్తు నాశనానికి కొనితెచ్చుకోవద్దాను. ఉన్నత చదువులు, ఉన్నత భవిష్యత్తు పతనానికి మత్తు కారణమౌతుందని ఆరోగ్యంగా బలహీన పడుతూ జీవిత కాలం తగ్గుతుందన్నారు. మత్తుకు బానిసలైన మిత్రులు తమతోటి మిత్రులను కూడా బానిసలను చేస్తు మత్తు మైకంలో అరాచకాలు చేయడం కారణంగా కేసులు తప్పవన్నారు. తద్వారా ఉన్నతి స్థితికి అవరోధాలు ఏర్పడతాయని మంచి విద్యార్థి దశను మత్తుకు బానిసల కానివ్వకండి. పేరెంట్స్ కష్టపడుతున్నారు. వారి కలలు నెరవేర్చడం బాధ్యతను గుర్తించాలన్నారు. ఉన్నత లక్ష్యం ఎంచుకుని లక్ష్యసాధనలో ముందుకు వెళ్ళండి. సక్సెస్ జీవితాన్ని కోరుకోవాలి అవలక్షనాలకు దూరంగా ఉండండి. చదువు పైన ధ్యాస పెట్టండి. చెడు వ్యసనాలు, దురలవాట్లకు దూరంగా ఉండండనీ ఆయన హితబోధ చేశారు. విద్యార్థి దశలోనే నేరాలు, చేయడం బాల్యంలోనే వాహనాలు నడపడం, ప్రేమ ముసుగులో బాలికలను ఏడిపించడం, అసభ్యంగా ప్రవర్తించడం నేరమని కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు నర్మెట రగురాములు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే భారీ జరిమానా

- భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి
- ఎంఐజీ కాలనీలో శానిటేషన్ డ్రైవ్ ప్రారంభం

**పటాన్ చెరు,విశాలభారతి** బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమాన తప్పదని భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆధర్ష్ రెడ్డి హెచ్చరించారు. బాధ్యతగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఆమె కోరారు. భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో "రిమూవల్ ఆఫ్ లెగసి వేస్ట్" 21 రోజుల శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం కార్పొరేటర్ సింధు ప్రారంభించారు. సంకల్ప గ్రౌండ్ ప్రాంగణంలో జిహెచ్ఎంసి సిబ్బంది, బాబ్కట్ సహకారంతో చెత్తా, చెదారాన్ని తీసివేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎంఐజి కాలనీలో ప్రతి పార్క్ చుట్టూ, రోడ్డు పక్కన ఉన్న దెబ్రిస్, చెత్తను శుభ్రం చేయాలని శానిటేషన్ సిబ్బందిని సూచించారు. కాలనీ వాసులు చెత్తా, చెదారాన్ని బయటవేయకుండా ఇళ్లకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వాలన్నారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ఇష్టం వచ్చినట్టు చెత్తా, చెదారాన్ని వేయకూడదని చెప్పారు. బహిరంగ ప్రదేశాలల్లో చెత్త వేస్తే భారీ జరిమానాతో పాటు కటిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సొసైటీ డైరెక్టర్లు వెంకట్ రావు, సుబ్బారావు, నారాయణ గౌడ్, జిహెచ్ఎంసి మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, శానిటరీ సూపర్వైజర్ వెంకటేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పరుగుల చిరుత, బోధన పరిశోధకుడు

- డాక్టర్ పల్లాటి నరేష్ కు ఆర్మీ లెఫ్టినెంట్ హోదా.
- 3 నెలల మిలటరి శిక్షణ పూర్తి చేసిన నరేష్
- ఎన్ఎస్ఎస్ లో కీలక సేవాలు



**సికింద్రాబాద్ ,విశాలభారతి:** ఉస్మానియా యూనివర్శిటీ సైఫాబాద్ కళాశాల భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ పల్లాటి నరేష్ కు ఆర్మీ లెఫ్టినెంట్ హోదా లభించింది. మహారాష్ట్రలోని నాగపూర్ వున్న ఎన్సీసి అధికారుల శిక్షణ కేంద్రంలో సుమారు మూడు నెలల పాటు మిలటరీ శిక్షణ పూర్తి చేసుకొని మేజర్ జనరల్ కపిల్ జిత్ సింగ్ రతోర్ చేతుల మీదుగా లెఫ్టినెంట్ ర్యాంక్ అందుకున్నారు. శిక్షణలో భాగంగా శారీరక ధారుఢ్యం, డ్రిల్, ఫైరింగ్, యుద్ధ విద్య, ఆఫీసర్ లక్షణాల శిక్షణ,ఎన్సీసి సంబంధిత అంశాలు,త్రివిధ దళాల నేపథ్యంతో పాటు క్రమశిక్షణ, సమయ పాలన తదితర అంశాలపై శిక్షణ తీసుకున్నారు. శిక్షణ కాలంలో నరేష్ అత్యంత ప్రతిభ కనబరచి కమాన్డెంట్ రాథోర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకొని హైదరాబాద్ తిరిగి వచ్చిన నరేష్ ను 3వ, తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శరత్, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మన్ నాయక్, అధ్యాపకులు అభినందించారు.ఈ సందర్భంగా నరేష్ తనకు ప్రోత్సహించిన హైదరాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ కుమార్ కు,డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఏ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గతంలో ఎన్నెస్సెస్ ద్వారా సమాజ సేవలో ముందంజ పల్నాటి నరేష్ గతంలో కూడా ఎన్ఎస్ఎస్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, క్యాంప్ లు నిర్వహించారు. తన ఆధ్వర్యంలో అనేక మంది విద్యార్థులు జాతీయస్థాయి శిబిరాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మన రాష్ట్ర ఉన్నతిని, సంస్కృతిని దేశవ్యాప్తంగా చాటిచెప్పారు. మేఘన అనే విద్యార్థిని గతంలో ఎన్ఎస్ఎస్ ద్వారా ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్లో పాల్గొనేలా ప్రోత్సహించారు.పల్నాటి నరేష్ అనేక జాతీయ సమైకృత శిబిరాలకు తెలంగాణ రాష్ట్రం తరపున నాయకత్వం వహించారు.2021లో మైసూర్ లో జరిగిన ఎన్ఐసీ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ గా అవార్డు అందుకున్నారు.కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి అవార్డులు అందుకున్నారు.

**పరుగుల చిరుత**

ఉస్మానియా యూనివర్సిటీ మైదానాన్ని తన శారీరక దారుడ్యానికి అనువైన ప్రదేశంగా మలుచుకొని అనేక హాఫ్ మారతాన్,ఫుల్ మారతాన్,ఐదు కిలో మీటర్ల పరుగు లో పాల్గొని అనేక పథకాలు కూడా సాధించారు. తను ఎక్కడున్నా సమాజ సేవ కోసం పరితపిస్తూ ముందుకు నడుస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**భోధన పరిశోధనలో నిత్యం ముందడుగు**

విద్యార్థులకు నిత్యం తరగతులు బోధిస్తూ అనేక అంతర్జాతీయ పరిశోధన పత్రాలు ముదించి వివిధ రాష్ట్రాల్లో సమర్పించి అక్కడ కూడా ఉత్తమ ప్రదర్శన అవార్డులు అందుకున్నారు. విద్యార్థుల ఉన్నతి కోరి వారి కోసం వీలైనంత సహాయం అందిస్తూ అనేకమంది విద్యార్థులను భారత త్రివిధ దళాల్లో ఆఫీసర్లుగా,సబ్ ఇన్స్పెక్టర్, టీచర్స్, సెంట్రల్ గవర్నమెంట్ జాబ్స్ వైపుగా అడుగులేయించారు.పలువురు నరేష్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**నూతనకల్, విశాలభారతి:** పోలీస్ స్టేషన్ పరిధిలోని తుంగతుర్తి సీఐ డీ శ్రీను నాయక్ ,నూతనకల్ ఎస్ఐ మహేంద్ర నాథ్ , పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పెషల్ బ్రాంచ్ తండు రవికుమార్ గౌడ్ , ఎర్రపహడ్ ఎక్స్ రోడ్డు నందు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానస్పదంగా వెళుతున్న అశోక్ లెలాండ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేసి అక్రమంగా మద్దిరాల మండలం నుండి ఆత్మకూరు మండలం పాతర్లపహాడ్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైస్ మిల్ కు తరలిస్తున్న సుమారు 60 బస్తాలు (30 కింటలు) పిడిఎస్ రైస్ ను వాటిని సరఫరా చేసే టి ఎస్30 టీ 3742 నంబర్ గల అశోక్ లైలాండ్ వాహనాము ను స్వాధీన పరుచుకొని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుడు ఇట్టి బియ్యం గతంలో సివిల్ సప్లై వారు సీజ్ చేసిన బియ్యాన్ని వేలం పాటలో కొనుగోలు చేసి తీసుకెళ్తున్నాం అని కొన్ని పత్రాలు చూపించిగా, వాటి పై అనుమానం తో సంబంధిత సివిల్ సప్లై అధికారులకి తెలుపగా వారు ఇట్టి బియ్యం నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్నారు అని తెలుపారు. నిందితులు గతంలో సీజ్ చేసిన బియ్యాన్ని వేలం పాటలో కొనుగోలు చేసినామని చెప్తూ సరి అయిన పత్రాలు లేకుండా సీజ్ చేసిన బియ్యం తరలింపు పేరు మీద నిబందనలని అతిక్రమించి బానోతు వెంకటేశ్వర్లు మద్దిరాల రేషన్ డీలర్ అయిన వెంకట్ రెడ్డి షాప్ నుండి కాసం రమేష్ కి చెందిన అశోక్ లీల్యాండ్ ఆటోలో, కాసం రమేష్‌రైస్ మిల్లు పాతర్లపాడుకు తీసుకువెళ్తున్నారని పోలీసు తెలియజేశారు.



## సెంచరీ కొట్టిన వృద్ధురాలు శాంతాబాయి..

- ఘనంగా వందో పుట్టిన రోజు వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న కుటుంబ సభ్యులు

**పటాన్ చెరు,విశాలభారతి:** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని జిన్నారం మండల కేంద్రానికి చెందిన చాలక్ లక్ష్మీబాయి తల్లి శాంతాబాయి 100వ జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి శాంతాబాయి తన కూతురు లక్ష్మీబాయి ఇంట్లో ముని మనుమలు, కుటుంబ సభ్యుల సమక్షంలో తన వందో పుట్టిన రోజును ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. శాంతాబాయి ఆరోగ్యంగా జీవిస్తూ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె నాలుగో తరం ముని మనుమలు, బిడ్డలు ఒకే చోట చేరి జన్మదిన వేడుకల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. శాంతాబాయికి నలుగురు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు, కోడళ్ళు, అల్లుళ్ళు, ముని మనుమలు కలిపి కుటుంబ సభ్యులు మొత్తం 70 మంది ఉన్నారు. నాలుగు తరాలకు పెద్దదిక్కుగా ఉంది శాంతాబాయి.సంపూర్ణ ఆరోగ్యంతో వందో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న శాంతాబాయితో కుటుంబ సభ్యులు ఫోటోలు, స్వీయచిత్రాలు తీసుకొని సందడిగా గడిపారు. ఎంతో ఉత్సాహంగా నిర్వహించిన ఈ వేడుకలో కుటుంబ సభ్యులందరూ మాతృమూర్తి శాంతాబాయి ఆశీర్వాదాలు పొందారు

# అనుమతి లేకుండ తాటి, ఈత చెట్లను నరికితే చర్యలు తప్పవు

- తాటి, ఈత కల్లులో మత్తు పదార్థాలు కలిపి అమ్మితే కేసులు నమోదు
- సిఐ బద్యనాథ్ చౌహన్




**ఆమనగల్లు, విశాలభారతి ::** ఆమనగల్లు ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో అనుమతి లేకుండ ఈత, తాటి, ఖర్జురా చెట్లను నరికినా, గెలలు కట్ చేసినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయని ఎక్సైజ్ సిఐ బద్యనాథ్ చౌహన్ చెప్పారు. ఈ సందర్బంగా బుధవారం అమనగల్లు సర్కిల్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ తాటి, ఈత వనాల తొలగింపు, చెట్లు, గెలలు కట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో గీతాకార్మికులు, రైతులు, రియల్ వ్యాపారులకు ఈ విషయమై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా వ్యవరించి తాటి, ఈత వనాలను తొలగించినా, చెట్లు, గెలలను కట్ చేసినా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకోబడతాయని సిఐ బద్యనాథ్ చౌహన్ హెచ్చరించారు. గీత కార్మికులు తాటి, కల్లులో మత్తు పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హాని కల్పించే విధంగా అమ్మితే కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు. ఎక్సైజ్ ఆక్ట్ ప్రకారం అనుమతి లేకుండా ఈత, తాటి, ఖర్జుర చెట్లను నరికిన, తొలగించిన 8712658742, 9000571671 ఈ నెంబర్లను సంప్రదించగలరని, వాట్సాప్, సమాచారం అందజేసిన వారి వివరాలు గొప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# నోరూ ఊరించే కల్లు

- పొట్ట కూటి కోసం అరచేతిలో ప్రాణం పెట్టుకుని
- సమస్యలతో సహజీవనం
- సాగిస్తున్న గీత కార్మికులు





**ఆమనగల్లు, విశాలభారతి:** నోరూరించే తాటి, ఈత కల్లుకు ప్రసిద్ధి గాంచిన రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాల్లో గీత కార్మికులు అనేక సమస్యలతో సహజీవనం సాగిస్తున్నారు. పొట్ట కూటి కోసం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని తాటి చెట్లు ఎక్కి కల్లు గీస్తూ జీవించే గీత కార్మికుల బతుకులు ప్రమాదకరం.తాటిచెట్లు ఎక్కేందుకు వెళ్లిన గీతకార్మికుడు క్షేమంగా తిరిగొస్తాడో రాడో అన్న ఉత్కంఠ...వారి గీత మార్చేందుకు ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సరైన ఆదరణ లేక రోజు రోజుకు కుల వృత్తి అంతరించిపోతున్నది. రియల్ ఎస్టేట్ వ్యాపారం, మొగి పురుగు దెబ్బకు తాటి, ఈత వనాలు అంతరించి పోతున్నాయి. ఊరూరా, వాడవాడలా వెలసిన బెల్టుషాపుల ధాటికి కల్లుకు గిరాకీ తగ్గిపోయింది. బెల్టుషాపుల అనుమతితో మద్యం ఏరులై పారుతుండటంతో కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న గీత కార్మికులకు ఉపాధి కరువై దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఒకప్పుడు కుటుంబ పోషణకు ఉపయోగపడ్డ గీత వృత్తి వల్ల లాభం లేదనుకుని ఇప్పటితరం ఆ వృత్తికి దూరం అవుతున్నారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల మండలాల పరిధిలోనిముద్విన్, మర్రిపల్లి, ఎక్వాయిపల్లి, కొనాపూర్, చరికొండ,నాగిల్ల, దొడ్డ పహాడ్, కొల్కులపల్లి, నర్సాయి పల్లి, గిరికొత్తపల్లి తదితర గ్రామాల నుంచి ప్రతి నిత్యం వందలాది మంది కల్లుగీత కార్మికులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బిజీబిజీగా ఉంటూ చెట్ల నుంచి సేకరించిన తాటి, ఈత కల్లును స్థానికంగా విక్రయించుకోవడం ద్వారా తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అంతేకాకుండా వారు నిత్యం తీసిన కల్లును ఇక్కడి నుంచి లారీలు, డీసీఎంల ద్వారా హైదరాబాద్, తదితర దూర ప్రాంతాలకు తరలించి ఉపాధి పొందేవారు.కేవలం కల్లుగీత వృత్తి పైన ఆధారపడి ఉపాధి పొందుతూ..జీవనం సాగించి వందలాది కుటుంబాలు నేడు ఈ ప్రాంతంలో రోజురోజుకు అంతరిస్తున్న తాటి, ఈత వనాలతో ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఊరూరా, వాడ వాడలా బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలుస్తుండడంతో గీత వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నదని, ఆ కాణంగా కల్లుకు గిరాకీ తగ్గిపోయిందనిచెబుతున్నారు..ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొట్ట కూటి కోసం తాటి చెట్లు ఎక్కి కల్లు గీసుకుని బతికే తమకు ఈ ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదన్నారు.

**అభిప్రాయం ::**
గ్రామాల్లో విచ్చలవిడిగా వెలసిన బెల్టుషాపుల వల్ల కల్లుకు గిరాకీ తగ్గింది. కుటుంబాలు గడవడం కష్టంగా మారింది. ఆర్థికఇబ్బందులతో కొట్టు మిట్టాడుతున్నాం.గౌడ సంఘానికి ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలి

**గాదమోని నర్సింహా :(ఎక్వాయిపల్లి)**

## గౌడ కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



గౌడ కులస్థులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అమనగల్లు గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్ గౌడ్ కోరారు. గౌడ కులస్తులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని.. అందువల్ల వారిని అన్ని రంగాల్లో ముందు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. గౌడ కులస్థులు ఆర్థికంగా ఎదిగేందుకు నిధులు కేటాయించాలని కోరారు.గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న పేద బడుగు బలహీన వర్గాల చెందిన గౌడ కులస్థులను ఆదుకోవాల్సిన అవసరం నేటి ప్రభుత్వాలపై ఉందన్నారు.ఎంతోమంది గీత కార్మికులు చెట్లపై నుండి కింద పడి మృతి చెందడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.నమ్ముకున్న వృత్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న గౌడ కులస్థులకు 'గౌడ బంధు'ను ప్రభుత్వం అమలు చేసీ ఆదుకోవాలని చుక్క నిరంజన్ గౌడ్ కోరారు.

**చుక్క నిరంజన్ గౌడ్**



# ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- దారమోని గణేష్

**కల్వకుర్తి, విశాల భారతి** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్వీ కల్వకుర్తి అధ్యక్షుడు దారమోని గణేష్ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అప్పులు చేసి కాలేజీ ఫీజులు కడుతున్నా సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ప్రైవేటు యాజమాన్యాలు ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యావ్యవస్థని నిర్వీర్యం చేసే పనిలో రేవంత్ సర్కారు ఉందని, రాష్ట్ర ముఖ్యమంత్రి వద్దె విద్యా శాఖను పెట్టుకుని ప్రభుత్వం ఏర్పడి పది నెలలు దాటినప్పటికీ ఒక రూపాయి కూడా విద్య వ్యవస్థ కోసం, ఫీజు రియంబర్స్మెంట్ కోసం కేటాయించకపోవడం విడ్డూరమని గణేష్ అన్నారు. సమీకృత గురుకులాల పేరుతో, ఇంటిగ్రేటెడ్ విద్య అని చెప్పి గురుకుల వ్యవస్థని నిర్వీర్యం చేయాలని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పన్నాగం చేస్తుందని, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పాఠశాలల మౌలిక వసతుల కోసం మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపడితే వాటికి నిధుల కేటాయింపులో అలసత్వం వహిస్తూ, ప్రభుత్వ బడి వ్యవస్థని నీరుగార్చే ప్రయత్నం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్స్ తిరిగి ఇవ్వడానికి ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, విద్యార్థుల తల్లిదండ్రులు కళాశాలల నుండి సర్టిఫికెట్లను తిరిగి తీసుకోవడం కోసం బయట అప్పులు చేసి మరి ఫీజులు చెల్లించి సర్టిఫికెట్స్ తెచ్చుకుంటున్నా కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని దారమోని గణేష్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యం గేట్లకు తాళాలు వేసి మరీ నిరసన తెలిపిన ఫీజు బకాయిలు విడుదల కాకపోవడం ఏంటని గణేష్ ఆరోపించారు. వెంటనే విద్యా వ్యవస్థ పైన రేవంత్ రెడ్డి సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవితవ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని గణేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వి, టిఆర్ఎస్ నాయకులు ఐల శేఖర్ గౌడ్, పేర కృష్ణ, అల్లుడు కృష్ణ, వర్కల పరుషరాములు, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# సిఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ పంపిన కాంగ్రెస్ నాయకులు


**బాల్కొండ, విశాల భారతి** బాల్కొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు దశలవారీగా ఉద్యోగాలు ఇస్తూ మొన్నటికి మొన్న డీఎస్సీ వేసి ఉద్యోగ ప్రక్రియ పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞత అభినందనల తీర్మానం పోస్ట్ ద్వారా పంపించారు. ఈ సందర్భంగా బాల్కొండ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిరంకుశత్వంతో ఉద్యోగాల భర్తీపై కాలయాపన చేస్తూ,నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణం అయిందని అన్నారు. కాని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 60 రోజుల్లో డీఎస్సీ ఉద్యోగ నియామకాన్ని పూర్తి చేసి నిరుద్యోగుల పక్షాన,పేదల పక్షాన, నిలబడే పార్టీ అని రుజువు చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించినందుకు నిరుద్యోగుల తరపున కృతజ్ఞత అభినందన ఏకగ్రీవ తీర్మానం చేసి సిఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామ సభల ద్వారా కమిటీలను ఏర్పాటు చేయాలి

- తీగల దయాకర్ గౌడ్

**దేవరుప్పుల విశాల భారతి** కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల కమిటీలు గ్రామసభ నిర్వహించకుండా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కమిటీలు నిర్వహించడంపై బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ గౌడ్ ఆధ్వర్యంలో దేవరుప్పుల మండల ఎమ్మార్వో హుస్సేన్, ఎంపిడిఓ లక్ష్మీ నారాయణలకు వినతిపత్రాన్ని దేవరుప్పుల మండల బిఆర్ఎస్ నాయకులు అందజేసారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు బస్వ మల్లేశం,మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ నక్క రమేష్,మాజీ వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్, ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ అనంతోజు కృష్ణమూర్తి, గండిపల్లి యాకయ్య,ఏఎంసి డైరెక్టర్ కుతాటి నర్సింహులు, జేరిపోతుల సాయిలు,వంగా అర్జున్, గొడుగు మల్లికార్జున్, కారుపోతుల భిక్షపతి,తటిపల్లి మహేష్, తోటకూరి కిష్టయ్య, లోడంగి వెంకన్న,జోగు ఐలుమల్లు, మేడ విద్యాసాగర్,చింత యాదగిరి, భాషిపాక అబ్బయ్య,చింత సోమయ్య, చింత పర్శరాములు, యువజన నాయకులు గాదరి శ్రీకాంత్,ఉప్పుల సామ్రాట్,మండల నాయకులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.



# చిన్నారి తేజస్విని ఆశీర్వదించిన బబ్బూరి శ్రీకాంత్ గౌడ్

**దేవరుప్పుల విశాల భారతి** దేవరుప్పుల మండలం, చిన్నమడుర్ గ్రామానికి చెందిన పరిదుల నగేష్ (చిన్న మామ) లావణ్యలా పుత్రిక తేజస్విని నూతన వస్త్ర, ఫల పుష్పాలంకరణ మహోత్సవం హైదరాబాద్ లోని ఒక హోటల్ లో జరిగింది. ఈ వేడుకకు బిఆర్ఎస్ జనగామ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ కుటుంబ సమేతంగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.



# వివాహ వేడుకకు హాజరైన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**దేవరుప్పుల విశాల భారతి** ప్రముఖ వ్యాపారవేత్త మల్లికార్జున డెవలపర్స్ అధినేత పాశం విమల రాణి శ్రీశైలం ఏకైక పుత్రుడు సాయికుమార్ అనూష వివాహం జనగామ లోని భ్రమరంభ కన్వెన్షన్ హాల్లో జరగగా ఈ వివాహానికి దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనుముల నాగరాజు, దావేర అనిల్ కుమార్, ఎస్టీ సెల్ యూత్ అధ్యక్షులు గుగులోత్ నరేందర్, దేవరుప్పుల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ గనుపాక ప్రదీప్, బీసు అజయ్ తదితరులు పాల్గొన్నారు.




# పథకాలు అందేలా చూసుకునే బాధ్యత నాదే

- ఎమ్మెల్యే పాయం

**ఆళ్లపల్లి, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలం బోడాయికుంట గ్రామ పంచాయతీ కేంద్రంలో బుధవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో ప్రజల సమక్షంలోనే మాట్లాడారు, ఆయా పంచాయతీ పరిధిలో గల గ్రామలలో ప్రభుత్వం ప్రారంభించిన గ్యారెంటీ పథకాలు ప్రజలకు చేరుతున్నాయా లేదా ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలకు తెలియజేసారు. అలాగే పంచాయతీలలో నీటి సరఫరా గురుంచి, కరెంటు సమస్యల గురుంచి, ఇరిగేషన్ ఇలా అన్ని సమస్యలను అధికారుల దృష్టిలోకి తెచ్చి వారం లోగ అన్ని సమస్యలు పరిష్కారం చేయాలనీ అదేశించారు. ఈనెల ఆకరిలోగా ఇందిరమ్మ ఇండ్ల పథకం, కొత్త ఫ్యామిలీ కార్డు సర్వే జరుగుతుందని అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇప్పించే బాధ్యత తనదని చెప్పారు. అలాగే ప్రజలకి ఎలాంటి కష్టం రాకుండా అధికారులతో పనులు చేపిస్తూ ప్రభుత్వం చేపట్టే ప్రతీ పథకం అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా చూసుకునే బాధ్యత తనే చూసుకుంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# మహిళలు మగ్గం వర్క్ ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- మగ్గం వర్క్ తో స్వయం ఉపాధికి బాటలు
- మల్కాపూర్ లో మగ్గం వర్క్ శిక్షణ సెంటర్ ప్రారంభోత్సవం

**చిగురుమామిడి, విశాల భారతి** మహిళలు మగ్గం వర్క్ నేర్చుకొని స్వయం ఉపాధికి బాటలు వేసుకోవాలని బైరైడ్ డైరెక్టర్ నాగరాజు కుమార్ తెలిపారు. బుధవారం కరీంనగర్ మండలం మల్కాపూర్ గ్రామంలో బై రాడ్ వారి ఆర్థిక సహకారంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని బైరైడ్ డైరెక్టర్ నాగరాజు కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి బైరైడ్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ మహిళలు మగ్గం వర్క్ ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించాలని,ఈ శిక్షణ కార్యక్రమాము 40రోజులపాటు కొనసాగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉచితరా మెటీరియల్ తోపాటు ఉచిత భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు వారికి ఉపాధికి అవకాశమార్గాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. కరీంనగర్ ఎల్డిఎం ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని, వారికి కావలసిన ఉపాధి అవకాశాలను ఏర్పరుచుకోవాలని, శిక్షణ అనంతరం మా యొక్క బ్యాంకుల ద్వారా మగ్గం వర్క్ షాప్ ఏర్పాటు చేసే మహిళలకు జె ఎల్ జి గ్రూపుల ద్వారా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు ఎక్కువ మొత్తంలో ఎలాంటి పూచికత్తులు లేకుండా బ్యాంకులో రుణాలను శ్రీ శక్తి కార్యక్రమం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ కృష్ణ మా బ్యాంకు ద్వారా మగ్గం వర్క్ నేర్చుకున్న వారికి లోన్స్ ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యదర్శి పెండ్లి సంపత్ కుమార్, జన వికాస కోఆర్డినేటర్ రాజు జనవికాస ట్రైలర్ మనీషా,మగ్గం వర్క్ బైరైడ్ ట్రైనర్ సూర్య కుమారి,60మంది మహిళా సంఘాల సభ్యులు,సిఏలు వివోఏ జ్యోతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో పత్తి కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట, విశాల భారతి** జిల్లాలో పత్తి కొనుగోలు చేయుటకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.బుధవారం కలెక్టర్ సమావేశ మందిరం నందు జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియకు సంబంధించి సిసిఐ ,వ్యవసాయ, మార్కెటింగ్, తూనికల కొలతలు, పోలీస్, రవాణా ,జిన్నింగ్ మిల్లుల యజమాలతో పాటు సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ మాట్లాడుతూ పత్తి క్వింటాలకు సిసిఐ కనీస మద్దతు ధర రూ.7521 లుగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు జిల్లాలో 78 వేల ఎకరాలలో పత్తి సేకరణకు అవకాశం ఉందని, జిల్లాలో 6 జిన్నింగ్ మిల్ కేంద్రాలలో పత్తి కొనుగోలు చేస్తారని, సూర్యాపేటలో 1, మంజీత్ కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ బాలెంల, తిరుమలగిరి లో 3 జన్నింగ్ మిల్లులు, సిద్ధి ఫైబర్, సంతోషిమాత కాటన ఇండస్ట్రీస్, శ్రీనివాస జిన్నింగ్ మిల్, చింతలపాలెంలో 2 జెన్నింగ్ మిల్లులు, డాక్టర్ అండ్ ఫ్రెండ్స్ కాటన్ జిన్నింగ్ మిల్ ,భారతమ్మ కాటన్ మిల్లు వద్ద కొనుగోలు జరుగుతుందని సిసిఐ అధికారులు అని ఏర్పాట్లు చూడాలని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కొనుగోళ్ల గురించి గ్రామాలలో విస్తృత ప్రచార నిర్వహించాలని మార్కెట్ అధికారులకు కలెక్టర్ సూచించారు. గోడపత్రికలు, కరపత్రాలు ముద్రించి ప్రచారం చేయాలని, కనీస మద్దతు ధర గురించి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతుల నుండి కొనుగోలు చేసే వద్ద త్రాగునీరు ట్యాంక్ ఏర్పాటు చేయాలన్నారు. చివరి కేజీ వరకు పత్తి కొనుగోలు చేస్తామని తెలిపారు. ఫైర్ ఆఫీసర్స్ మిల్లులను పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ పేర్కొన్నారు. పోలీస్ అధికారులు అన్ని చోట్ల బందోబస్తు నిర్వహించాలని అలాగే ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేటట్లుగా చూడాలన్నారు .మిల్లు యజమానులు హమాలీల సమస్య లేకుండా చూడాలని తెలిపారు. పత్తి కొనుగోలు చేసిన మూడు రోజులలో రైతు ఖాతాలో డబ్బులు జమ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉత్పాన్నమైన టోల్ ఫ్రీ నెంబర్ 6281492368 కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు జర్నింగ్ మిల్లుల వద్ద తూకం కచ్చితంగా ఉండేలా చూడాలని, ఎలక్ట్రానిక్ తూకం స్కేల్ ని కూడా తనిఖీ చేయాలని, గిన్నింగ్ మిల్లుల వద్ద కంప్యూటర్లు, ప్రింటర్లు, వెబ్ కెమెరాలు, తూనికలు, ఫింగర్ ప్రింటర్స్ స్కానర్లు, ఇంటర్నెట్ సదుపాయం, ఏఎంసీ కార్యదర్శులు పరిశీలించిన నివేదిక సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లతా, సూర్యాపేట మార్కెటింగ్ అధికారి ఆర్ సంతోష్ కుమార్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జానయ్య, వీద్యుత్ శాఖ అధికారి ఉదయ భాస్కర్, డిఐసి జనరల్ మేనేజర్ జే సీతారాం, ఆర్టిఓ జి సురేష్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి జి శ్రీధర్ రెడ్డి, మార్కెటింగ్ అధికారులు కే శ్రీధర్, డి శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, జిన్నింగ్ మిల్లు యజమానులు ఆర్ రామన్, సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉదయ్ కుమార్, కే. సంజీవరెడ్డి, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



# అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**పటాన్ చెరు(గుమ్మడిదల),విశాలభారతి**రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం గుమ్మడిదల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 56 లక్షల రూపాయల విలువైన చెక్కులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పూర్తి పారదర్శకతతో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం కాబోతుందని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, సీనియర్ నాయకులు విజయ్ భాస్కర్ రెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పుట్ట నర్సింగ్ రావు, నరేందర్ రెడ్డి, తహసిల్దార్, రెవెన్యూ అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్దే లక్ష్యంగా ప్రజా పాలన

- రోడ్ల అభివృద్ధికి రూ.20 కోట్ల 80 లక్షల నిధుల మంజూరు
- సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు,విశాలభారతి**గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలన అందిస్తున్నారని, పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని రహదారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇటీవల 20 కోట్ల 80 లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మంత్రి దామోదర రాజ నరసింహాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. నిధులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్ చెరు నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని తెలిపారు. ఇందుకు అనుగుణంగా నూతన రహదారుల నిర్మాణం, బ్రిడ్జిల నిర్మాణానికి 20 కోట్ల 80 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అతి త్వరలో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. నూతన రహదారుల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

**మంజూరైన పనుల వివరాలు..**

1.పటాన్ చెరు మండలం పాశమైలారం గ్రామ పరిధిలోని కిరిబీ పరిశ్రమ నుండి క్యాసారం మీదుగా ఓడిఎఫ్ వరకు రోడ్డు మరియు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఒక కోటి పది లక్షల రూపాయలు.

2.పటాన్ చెరు మండలం లక్డారం నుండి బేగంపేట వరకు హై లెవెల్ బ్రిడ్జి మరియు రోడ్డు నిర్మాణానికి రెండు కోట్ల 50 లక్షల రూపాయలు.

3.పటాన్ చెరు మండలం చిన్న కంజర్ల బైపాస్ రోడ్డు నుండి అందూర్ పి డబ్ల్యు డి రోడ్డు వరకు రహదారి నిర్మాణానికి 60 లక్షల రూపాయలు..

4.పటాన్ చెరు మండలం భానూరు గ్రామ పరిధిలోని పి డబ్ల్యూ డి రోడ్డు నుండి నందిగామ మీదుగా క్యాసారం వరకు రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు..

5.పటాన్ చెరు మండలం భానూరు గ్రామ పరిధిలోని మంజీరా రోడ్డు నుండి బుల్కాపురం వరకు రోడ్డు నిర్మాణానికి 3 కోట్ల రూపాయలు.

6.పటాన్ చెరు మండల పరిధిలోని రామేశ్వరం బండ నుండి మాదారం మీదుగా వడకపల్లి వరకు హై లెవెల్ బ్రిడ్జి మరియు రోడ్డు నిర్మాణానికి 50 లక్షల రూపాయలు.

7.జిన్నారం మండల పరిధిలోని వావిలాల నుండి జంగంపేట వరకు రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 56 లక్షల రూపాయలు.

8.జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామం నుండి రాళ్లకత్వ తాండా వరకు రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 80 లక్షల రూపాయలు.

9.జిన్నారం మండలం శివానగర్ గ్రామం నుండి కొడకంచి వరకు రోడ్డు నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు..

10.గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి నుండి నాగిరెడ్డిగూడెం మీదుగా శివాయిగూడ వరకు రోడ్డు నిర్మాణానికి ఒక కోటి 50 లక్షల రూపాయలు..

11.గుమ్మడిదల మండల పరిధిలోని గుమ్మడిదల నుండి బొంతపల్లి దేవాలయం వరకు రహదారి నిర్మాణానికి రెండు కోట్ల 90 లక్షల రూపాయలు.

12.గుమ్మడిదల మండలం అన్నారం గ్రామ పరిధిలోని పిడబ్ల్యుడి రోడ్డు నుండి ఎక్స్ సర్వీస్మెన్ కాలనీ వరకు రహదారి నిర్మాణానికి ఒక కోటి పది లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తెలిపారు.



# విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

**బాల్కొండ, విశాల భారతి** భీమ్‌గల్ మండలంలో డిఎస్సీ 2024లో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులను విధుల్లో చేర్చుకున్నట్లు మండల విద్యాశాఖ అధికారి డీ.స్వామి తెలిపారు. ఎస్జిటి 32, ఎస్ఎ 12 మంది విధుల్లో చేరారు. చేరిన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పిఆర్టియు యూనియన్ సభ్యులు నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు అధ్యక్షుడు ఎడ్ల శేఖర్,ప్రధాన కార్యదర్శి కర్ణాల శ్రీనివాస్,రాస దయాకర్,కాశీరం, ప్రభాకర్,వాసుదేవ్,వినోద్ కుమార్, సుదకర్,మురళిదర్,రవీందర్,రాధికా సుమలత పాల్గొన్నారు.





# వరద బాధితులకు సహాయపడాలి

- ఫౌండర్ డాక్టర్ భూక్యా లాజరస్ లాల్ సింగ్
- సీతారాంతండా బాధితులకు బడావో బంజారా ప్రొజెర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

**మరిపెడ, విశాలభారతి:** వరద ముంపుకు గురైన బాధితులను ఆదుకోవడానికి మానవత్వంతో సేవ చేయాలని బాడావో బంజారాబడావా బంజార ఫోజెర్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ భూక్య లాజరస్ లాల్ సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని సీతారాం తండా ముంపు బాధితులకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈ ప్రాంతంతో గత 25 ఏళ్లగా సంబంధాలు ఉన్నాయని, పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి దగ్గర గతంలో యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో నేను ఒకడిని ఉన్నాను అన్నారు. అంతేగాక వరద ప్రమాదంలో తండ్రి బిడ్డ ఇద్దరు కొట్టకపోవడం నా హృదయం చలించిపోయిందన్నారు. ఆలస్యమైన సరే ఈ ప్రాంత ప్రజలను కలుసుకొని వారికి ఎంతో కొంత సహాయపడాలని ఉద్దేశంతో ఈరోజు సీతారాం తండ రావడం జరిగిందన్నారు. సర్వసం కోల్పోయి ఇబ్బందులు పడ్డ వారిని ప్రభుత్వాలు సాయం చేస్తున్న వారి ముఖంలో ఆనందంలేకుండా పోయిందన్నారు. వరద తాకిడికి భయపడిన వారు ఇంకా భయం గుప్పెట్ల నుండి నుండిబయటపడలేకపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తండ ధర్మారం మాజీ సర్పంచ్ గుగులోత్ లక్ష్మీ లక్పతి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా లచ్చన్న , ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్, ప్రేమ్ సాగర్ సింగ్, మేనేజర్ సోలోమోన్, సంస్థ ప్రతినిధులు రామాచారి,భూఖ్యమన్సూర్ నాయక్, బాలరాజు, సందీప్, సుధాకర్, శంకర్, కిరణ్, సంగీత, రాజ్ కుమార్, శ్రీనివాస్, ఉపేందర్, తండ దవాసులు ఉన్నారు.

# ఈనెల 21 నుండి జిల్లాలో పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు

- పోలీసు ఫ్లాగ్ డే కార్యక్రమాల్లో ప్రజలు, యువత, విద్యార్థులు పాల్గొనాలి
- సన్ ప్రీత్ సింగ్





**సూర్యాపేట, విశాల భారతి** విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసులను స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరవీరుల దినోత్సవం పోలీస్ ఫ్లాగ్ డే జరుపుకుంటున్నామని జిల్లా ఎస్పి సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపినారు. సమాజ రక్షణలో అమరులైన పోలీసులను స్మరిస్తూ ఈనెల 21వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. యువత, విద్యార్థులు బాగమై అమర పోలీసులకు నివాళి ఘటించాలి అన్నారు. పోలీస్ విధులు, టెక్నాలజీ ఉపయోగం పై పోలీస్ ఓపెన్ హౌజ్ కార్యక్రమం నిర్వహిస్తాం, అత్యవసర సమయంలో బాధితులకు అందించడానికి రక్తదాన శిబిరం నిర్వహించి రక్తం సేకరిస్తామని, అమరవీరుల కుటుంబాల సందర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారని, అమరులైన పోలీస్ లను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలి, సైకిల్ ర్యాలీ నిర్వహిస్తాం, పోలీసు ప్రతిభ తెలిపే లఘు చిత్రాల పోటీలు, ఫోటోగ్రఫీ పోటీలు ఉంటాయని అన్నారు. సినిమా థియేటర్స్ నందు పోలీసు ప్రతిభను తెలిపే చిత్రాల ప్రదర్శన ఉంటుంది అని ఎస్పి పేర్కొన్నారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయని మొదటి విభాగంలో 12వ తరగతి విద్యార్థుల వరకు విచక్షణతో కూడిన మొబైల్ ఫోన్ వాడకం అనే అంశంపై, రెండోవ విభాగంలో డిగ్రీ ఆపై విద్యార్థులకు తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర అనే అంశాల పై వ్యాసం రాయాలని, ఈ వ్యాస రచన పోటీలో పాల్గొనవలసినదిగా కోరారు. రెండు విభాగాల్లో ఎంపిక చేసిన ఉత్తమ మూడు వ్యాసాలకు బహుమతి ప్రదానం చేస్తామని, ఆ వ్యాసాలను సంబంధిత జిల్లా పోలీసు అధికారిక సోషల్ మీడియా పేజీలలో పోస్ట్ చేయటం జరుగుతుందని, జిల్లా స్థాయిలో ఉత్తమ మూడు వ్యాసాలను ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని అన్నారు.

**లఘు చిత్రాలు, ఫోటోల పోటీలు:**

పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే తక్కువ విడిది గల షార్ట్ ఫిల్మ్స్, రీసెంట్ ఫొటోలు, ఆర్టికల్ లపై కాంపిటీషన్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు వారి వద్ద ఉన్న షార్ట్ ఫిలిమ్స్, పోలీసు ప్రతిభ తెలిపే రీసెంట్ ఫొటోస్, న్యూస్ ఆర్టికల్స్ ను జిల్లా పోలీసు కార్యాలయం నందు పోలీసు ప్రజల సంబంధాల అధికారికి ఈ నెల 27వ తేదీలోగా అందించాలని, వివరాలకు 7013923377 ను సంప్రదించవచ్చని తెలిపారు. పోలీసు సిబ్బందికి రెండు విభాగాల్లో వ్యాసరచన పోటీలు ఉంటాయని అన్నారు.



# ప్రాణాలకు అభయం కాటమయ్య రక్షణ కవచం

- జై గౌడ్ ఉద్యమ జిల్లా అధికార ప్రతినిధి

**పాలకీడు, విశాలభారతి:** కల్లుగీత కార్మికుల ప్రాణాలకు అభయం, కాటమయ్య రక్షణ కవచం అని జై గౌడ్ ఉద్యమ జిల్లా అధికార ప్రతినిధి బొల్లగాని సుబ్బు గౌడ్ అన్నారు. బుధవారం గరిడే పల్లి మండల కేంద్రము అబ్బిరెడ్డి గూడెం రోడ్ లో కాటమయ్య రక్షణ కిట్ల ట్రైనింగ్ ను ఎక్సైజ్ శాఖ ఎస్సై వెన్నెల,ట్రైనర్స్ తో పాటు పాలక వీడు మండలం లోని పలు గ్రామాల గీత కార్మికులతో కలిసి పరిశీలించారు. గౌడ కుల స్థులకు రక్షణ కవచం పంపిణీ చేయడం గీత కార్మికులకు ఒక వరం అని అన్నారు. కాటమయ్య రక్షక కిట్ల పంపిణీ గీత కార్మికులను ప్రమాదం నుంచి రక్షించాలనీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ప్రతీ గీత కార్మికుడికి కిట్లను పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై వెన్నెల, ట్రైనర్స్ జెరిపోతుల క్రిష్ణయ్య, నోముల వెంకన్న,పల్స మధు, ఆకుల రమేష్,పెంటగాని హరీష్, గీత కార్మికులు లింగయ్య గౌడ్, వీరబాబు గౌడ్, వెంకటయ్య గౌడ్, సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కమిటీలను అఖిలపక్ష కమిటీలుగా మార్చాలి

- కందగట్ల అనంత ప్రకాష్ డిమాండ్



**పాలకీడు, విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడానికి లబ్ధిదారులు నిర్ణయించడానికి ఇందిరమ్మ కమిటీల పేరిట అంతర్లీనంగా వీటిని కాంగ్రెస్ కమిటీలుగా మార్చి వేసే కుట్ర లో భాగమేనని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి కందగట్ల అనంత ప్రకాష్ తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక న్యాయంగా పేద వారికి లబ్ధి జరగాలంటే ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలు అమలుతోపాటు అన్ని రాజకీయ పక్షాలను చేర్చి అఖిలపక్ష కమిటీలుగా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం వారి కంటే ముందు కాంగ్రెస్ పాలనలో ఇందిరమ్మ ఇళ్లను ఎద్దేవోచేసి కెసిఆర్ పేదలకు ఇవ్వకపోగా తన తొమ్మిదేళ్ల పాలనలో డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి లబ్ధిదారులను నిర్ణయించకపోవడం దారుణ విషయమని ఆయన అన్నారు. అదే సందర్భంలో కాంగ్రెస్ ప్రభుత్వం సొంత విలువ స్థలాలు ఉన్నవారిని ఇందిర ఇండ్ల పేరు ఇల్లు కట్టుకోనడానికి 5 లక్షల ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించిందని అన్నారు.



# ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దు

- కొనుగోలు కేంద్రాలలోనే ప్రభుత్వ మద్దతు ధర పొందాల
- డిఆర్డిఏ పీడీ శేఖర్ రెడ్డి

**శాలిగౌరారం ,విశాలభారతి:** రైతులు తాము పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలని డిఆర్ డీఏ పీడీ వై. శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం శాలిగౌరారం మండలం భైరవునిబండ, నూలగడ్డ కొత్తపల్లి ,చిత్తలూర్ ,తుడిమిడి, రామనజపురం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీడీ శేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. సన్న రకం ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కేంద్రాలలో గన్నీ బ్యాగుల,లారీల, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు తేమ లేని ధాన్యాన్ని మాత్రమే తీసుకరావాలని కోరారు.జిల్లాల్లో ఇప్పటికే 150 కి పైగా కేంద్రాలను ప్రారంభిచ్చినట్లు తెలిపారు. ధాన్యాన్ని మిల్లులో, మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఏమన్నా ఇబ్బందులు ఉన్నట్లు అయితే టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని రైతులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్ రెడ్డి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి లక్ష్మి, ఏపీఎం జానకి, మార్కెటింగ్ ఎస్సిఆర్పి దాసరి శాంత, ఏ ఓ సౌమ్య శృతి, ఏపీవో జంగమ్మ,ఈసీ వెంకటాచారి, ఏఈవో వీరేష్ రైతులు పాల్గొన్నారు.





## పలు శాఖాధికారులతో

# జిల్లా కలెక్టర్ సమీక్షసమావేశం

**కొత్తగూడెం, విశాలభారతి:** ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న ఐసిడిఎస్ ఆక్టివిటీస్, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్ మరియు చైల్డ్ హెల్ప్ లైన్ పై అధికారులతో బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ చేపడుతున్న ఐసిడిఎస్ ఆక్టివిటీస్, చైల్డ్ ప్రొటెక్షన్, అడాప్షన్ మరియు చైల్డ్ హెల్ప్ లైన్ పై అధికారులతో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ లోప పోషణకు గురైన పిల్లలను సాధారణ స్థితికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని, ప్రతి అంగన్వాడీ కేంద్రం నందు త్రాగునీటి వసతి, విద్యుత్, మరుగుదొడ్లు మొదలైన కనీస వసతులు కల్పించాలని అన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో మునగ, కరివేపాకు, ఉసిరి, చింత మరియు వెలగ మొక్కలు తప్పనిసరిగా నాటాలని ఆదేశించారు. ఈ మొక్కలు నాటి వినియోగించడం ద్వారా విటమిన్ ఏ, సి, డి క్యాల్షియం పుష్కలంగా వస్తాయని దీని ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని అన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాల వివరాలు, స్థలం వివరాలు అందజేయాలని సిపిడిఓలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు మరియు ఐసిడిఎస్ కార్యాలయం ల నిర్మాణానికి త్వరలోనే స్థలం కేటాయిస్తామన్నారు. జిల్లాలో బాల కార్మికుల నిర్మూలన, బాలల భిక్షాటన మరియు బాల్య వివాహాల నిర్మూలన కోసం డి సి పి యు సమన్వయంగా పనిచేసి జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా మార్చాలని అన్నారు.



# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మాదకద్రవ్యాలు సేవించడం నేరం
- అమ్మే వారి సమాచారం ఉంటే తెలపండి

**పినపాక, విశాలభారతి:** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెడ్ కానిస్టేబుల్ మన్సూర్ అన్నారు. బుధవారం ఈ బయ్యారం ఎస్ఐ రాజ్ కుమార్ ఆదేశాల మేరకు శ్రీవిద్య జూనియర్ కళాశాల, రాధిక హై స్కూల్ లో సైబర్ జాగ్రుకాత దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ విద్యార్థులు, ప్రజలు తమ వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఆన్లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని, తెలియని మెసేజ్లు పై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెబుతూ బహుమతులు వచ్చాయని లాటరీ తగిలిందని, లోన్లు ఇస్తామని, ఇతరత్రా ఆశ చూపి ఆన్లైన్ ద్వారా డబ్బులు ఎరవేస్తారని అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్లకు స్పందించరాదని తెలిపారు. అంతే కాకుండా గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా వస్తే ఆశ్రమం కలిగించవద్దని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,మాదకద్రవ్యాలు అమ్మే వారి సమాచారం ఉంటే దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నిరోషా, వైస్ ప్రిన్సిపల్ రవి ప్రసాద్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యను అందరికీ అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**మునుగోడు విశాల భారతి** సింగారం గ్రామంలో బుధవారం ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ ఎస్ యు ఐ నాయకులు సోమగోని నవీన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే ప్రభుత్వ విద్యకు స్వర్ణ యుగంగా శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం మునుగోడును అన్ని రంగాలలో ధ్వంసం చేస్తే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యకు, వైద్యానికి పెద్దపీట వేస్తుందని కొనియాడారు. 100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మునుగొడు నియోజకవర్గానికి రావడానికి కృషి చేయడంతో పాటు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నేరుగా పాఠశాలను సందర్శించిన ఎంమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు అంతా ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. రాజగోపాల్ రెడ్డి విద్యవ్యవస్థపైన అవగాహన విద్యార్థులపై ఉన్న ప్రేమ విద్యావ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తుందని రాజగోపాల్ రెడ్డి విద్యాశాఖ మంత్రిగా నియమిస్తే ఈ రాష్ట్రము, మునుగోడు నియోజకవర్గం అంతా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తపరచడం జరిగింది. అదేవిధంగా ఈ పాఠశాలలో అత్యఆధునిక టెక్నాలజీలతో చదువు అందించడమే ధ్యేయంగా కాంగ్రెస్ అడుగులు వేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ నాయకులు సోమగోని నవీన్ గౌడ్ ,నకరికంటి సాయికుమార్,పిట్టల అభినయ్, సోమగొని మహేష్,రావుల దిలీప్,ఉప్పునూతల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



# తేజస్విని నందమూరి సమర్పణలో 'అఖండ 2 తాండవం' ఘనంగా ప్రారంభం

ఇండియన్ సినిమాలో మోస్ట్ క్రేజీయస్ట్ కాంబినేషన్ గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, బ్లాక్ బస్టర్ మేకర్ బోయపాటి శ్రీను సింహా, లెజెండ్, అఖండ తో హ్యాట్రిక్ బ్లాక్ బస్టర్స్ అందుకున్న తర్వాత నాల్గవసారి కలిసి పని చేయనున్నారు. వీరి కాంబినేషన్ లో వచ్చిన ప్రతి చిత్రం అంచనాలను మించింది, NBKకి బిగ్గెస్ట్ హిట్ గా నిలిచింది. ముఖ్యంగా వారి గత చిత్రం 'అఖండ' చాలా బాక్సాఫీస్ రికార్డులను బద్దలు కొట్టింది. హిందీ డబ్బింగ్ వెర్షన్ ఉత్తరాది ప్రేక్షకుల నుంచి అద్భుతమైన ఆదరణ పొందింది. ఎం తేజస్విని నందమూరి సమర్పకురాలిగా 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మించనున్న న్యూ మూవీ #BB4 అఖండ చిత్రానికి సీక్వెల్, దీనికి అఖండ 2 అని టైటిల్ పెట్టారు. ఇది బాలకృష్ణ, బోయపాటి ఇద్దరికీ మేడిన్ పాన్ ఇండియా మూవీ. అద్భుతంగా డిజైన్ చేసిన టైటిల్ పోస్టర్ డివైన్ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంది. టైటిల్ ఫాంట్ స్ఫటిక లింగం, ఒక శివ లింగాన్ని కలిగి ఉంది, ఇది డివైన్ ఇంపార్టెన్స్ ని సూచిస్తుంది. టైటిల్ తో పాటు పవర్ ఫుల్ క్యాప్షన్ తాండవం, రెండు డమరుకంలు చుట్టుముట్టబడి, శివ నృత్యాన్ని సూచిస్తున్నాయి. బ్యాక్ డ్రాప్ లో హిమాలయాలు భక్తి వాతావరణాన్ని ఎలివేట్ చేస్తున్నాయి. టైటిల్ పోస్టర్ సీక్వెల్ మరపురాని గూస్‌బంప్ మూమెంట్స్ తో ఎపిక్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తోందని సూచిస్తుంది. మొత్తం కోర్ టీమ్, పలువురు అతిథుల సమక్షంలో అఖండ 2 ఈరోజు ఘనంగా ప్రారంభమైయింది. ముహూర్తం షాట్ కు తేజస్విని కెమెరా స్విచాన్ చేయగా, బ్రాహ్మణి క్లాప్ కొట్టారు. ముహూర్తం షాట్ కు బాలకృష్ణ పవర్ ఫుల్ డైలాగ్ చెప్పారు. అఖండలో హీరోయిన్ గా నటించిన ప్రగ్యా జైస్వాల్ ఈ సీక్వెల్ లో పార్ట్ అయ్యారు, గ్రాండ్ లాంచ్ వేడుకకు హాజరయ్యారు. కథలో ఆధ్యాత్మిక అంశాలను తెలిపే అఖండ 2 టైటిల్ థీమ్‌ను నందమూరి రామకృష్ణ ఆవిష్కరించారు. Sఎస్ థమన్ పూనకాలు తెప్పించే బ్యాగ్ గ్రౌండ్ స్కోర్ ప్రత్యేకంగా నిలిచింది, ఇది గ్రేట్ ప్రొడక్షన్ వాల్యూస్ ని ప్రామిస్ చేస్తోంది. బాలకృష్ణను లార్జర్ దేన్ లైఫ్ క్యారెక్టర్స్‌లో ప్రెజెంట్ చేయడంలో బోయపాటి దిట్ట. ఎన్‌బికెని వెరీ కమాండింగ్ క్యారెక్టర్ లో ప్రజెంట్ చేయడానికి యూనివర్సల్ అప్పీల్ తో పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రాశారు బోయపాటి. ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అఖండ 2 హై బడ్జెట్ తో భారీ స్థాయిలో నిర్మించబడుతుంది. ఇది బాలకృష్ణ, బోయపాటి ఇద్దరికీ మోస్ట్ ఎక్స్ పెన్సీవ్ మూవీగా నిలుస్తోం.

# అందరికీ అందుబాటులో 'వేట్టయన్ ద హంటర్' టికెట్ రేట్లు



సూపర్‌స్టార్ రజినీకాంత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'వేట్టయన్ ద హంటర్' సినిమాకు వచ్చిన రెస్పాన్స్ అందరికీ తెలిసిందే. టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. సుభాస్కరన్ నిర్మాతగా వ్యవహరించారు. దసరా సందర్భంగా అక్టోబర్ 10న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతోంది. ఏసియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ తో కలిసి దిల్ రాజు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేశారు. సీడెడ్ ఏరియాలో శ్రీ లక్ష్మి మూవీస్ రిలీజ్ చేసింది. గ్లోబల్ గా అన్ని ఏరియాల్లో విజయవంతంగా ప్రదర్శించబడుతూ రికార్డులు క్రియేట్ చేస్తోంది. ఇక ఈ దసరా సెలవులు ముగియడంతో అందరికీ అందుబాటులో ఉండే విధంగా తెలంగాణలో ఈ మూవీ టికెట్ రేట్లను తగ్గించారు. మల్టీ ప్లెక్సుల్లో రూ. 200, సిటీ సింగిల్ స్క్రీన్‌లలో రూ. 150, డిస్ట్రిక్ట్ సింగిల్ థియేటర్లలో రూ. 110గా టికెట్ రేట్లను ఫిక్స్ చేశారు. ఈ రేట్లు అక్టోబర్ 18 నుంచి అందుబాటులోకి రానున్నాయి. దీంతో మరింత కలెక్షన్లు పెరిగేలా కనిపిస్తున్నాయి. వేట్టయన్ మూవీకి ఇప్పుడు ఆక్యుపెన్సీ పెరిగేట్టు కనిపిస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ స్టార్స్ అమితాబ్ బచ్చన్, మంజు వారియర్, ఫాహిద్ ఫాజల్, రానా దగ్గుబాటి, రితికా సింగ్, దుశారా విజయన్ నటన ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది. ప్రతి యాక్టర్ కూడా తన ఎనర్జిటిక్ పర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నాడు. అనిరుధ్ అందించిన సంగీతం ఈ సినిమా విజయంలో కీలకంగా మారింది. లైకా ప్రొడక్షన్స్‌కు చెందిన GKM తమిళకుమారన్, రెడ్ జెయింట్ మూవీస్ బ్యానర్‌పై M షెన్‌బాగమూర్తి ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తున్నారు. న్యాయం, అధికారం, ఎన్‌కౌంటర్ హత్య, అవినీతి విద్యా వ్యవస్థ ఇతివృత్తాలను ఈ సినిమాలో ఎంతో పవర్ ఫుల్ గా చూపించారు. వెట్టయన్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే ₹240 కోట్లను అధిగమించిన సంగతి తెలిసిందే. ఇక తెలంగాణలో టికెట్ రేట్లు తగ్గించడంతో మరింతగా వసూళ్లు పెరిగే అవకాశం ఉంది.



# డెనిమ్ షార్ట్ లో అందాల ఈషా

సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుకుగా ఉండే నటి ఈషా రెబ్బా, తాజాగా షేర్ చేసిన ఫోటోలు మరోసారి అభిమానులను ఆకట్టుకున్నాయి. "Me and my warm mirror vibes" అంటూ క్యాప్షన్ పెట్టిన ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. ఫోటోల్లో ఈషా సింపుల్ టీషర్ట్, డెనిమ్ షార్ట్ ధరించి, తన ఫిట్‌నెస్ పై కృషిని స్పష్టంగా చూపిస్తున్నారు. ఆ మధ్య జిమ్ లో వర్కౌట్స్ చేసిన తర్వాత తీసిన కొన్ని ఫోటోలు బాగా వైరల్ అయిన విషయం తెలిసిందే. ఫోటోలలో ఆమె ముఖంపై చెమట కనబడటం, ఫిట్ గా ఉండేందుకు ఆమె ఎంత కష్టపడుతున్నారో చెప్పకనే చెబుతోంది. ఇక ఇప్పుడు అమ్మడు మరోసారి ఆ రేంజ్ లో లెగ్స్ అందాలతో షాక్ అయ్యేలా స్టిల్ ఇచ్చింది. ఈషా తన అందంతో పాటు ఫిట్‌నెస్ విషయంలో కూడా ఎంతో కసరత్తులు చేస్తోంది. తెలుగు అమ్మాయి అయినప్పటికీ, తన అందంతోనూ, టాలెంట్ తోనూ ఆమె తమిళం సహా ఇతర భాషల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. వెబ్ సిరీస్ లలో నటిస్తూ కొత్త అవెన్యూస్ ను అన్వేషిస్తోంది. అయితే మంచి కాంటెంట్ ఉన్న క్యారెక్టర్ దొరికితే గ్లామరస్ పాత్రలు చేయడానికి ఇబ్బంది లేదని అమ్మడు గతంలోనే క్లారిటీ ఇచ్చింది. ఇక ఇప్పుడు ఫొటోలతో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. ఈషా ఆమధ్య "దయా" అనే వెబ్ సిరీస్ లో డీ గ్లామర్ లుక్ లో కనిపించి ప్రశంసలు అందుకుంది. అందులో నిండు గర్భిణిగా నటించి, తన నటనలో ఉన్న వైవిధ్యాన్ని మరోసారి నిరూపించుకుంది. ఇక ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈషా రెగ్యులర్ గా ఫోటోలను షేర్ చేస్తూ, అభిమానులను మరింత దగ్గరగా చేసుకుంటుంది. ఈ సారి న్యూ లుక్ లో ఆమె సింప్లిసిటీతో పాటు, ఫిట్‌నెస్ పై ఉన్న ప్రేమను కూడా మరోసారి నిరూపించింది.

# పొట్టేల్' మ్యూజికల్ గా న్యూ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది

**: మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర**



యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్ లో సాహిత్ మోత్ఖూరి డైరెక్ట్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. ఈ చిత్రంలో అజయ్ పవర్ ఫుల్ రోల్ పోషిస్తున్నారు. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు స్ట్రాంగ్ బజ్ క్రియేట్ చేశాయి. శేఖర్ చంద్ర అందించిన సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. 'పొట్టేల్' అక్టోబర్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్ చంద్ర విలేకరుల సమావేశంలో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. డైరెక్టర్ సాహిత్ తో ఇంతకుముందు సవారి అనే సినిమా చేశాను. అందులో పాటలు మంచి హిట్ అయ్యాయి. సినిమా కూడా బాగానే రీచ్ అయింది. సాహిత్ చాలా కొత్త థాట్స్ తో వస్తాడు. పొట్టేల్ కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. కళ్లెంబట నీళ్లు వచ్చాయి. పిల్లల చదువు కోసం పేరెంట్స్ ఎంత స్ట్రగుల్ అయినా పడాలి అనే మంచి పర్పస్ ఈ సినిమాలో ఉంది. విలేజ్ బ్యాక్ డ్రాప్లో ఈ కథ ప్రేక్షకుల మనసుల్ని హత్తుకునేలా ఉంటుంది. రూరల్ బ్యాక్ డ్రాప్ లో అంబాజీపేట లాంటి సినిమాలు చేశాను. కానీ 'పొట్టేల్' డిఫరెంట్. ఏదో సినిమాకి రీ రికార్డింగ్ చేసినట్లు ఉండదు. సిచువేషన్ నుంచి మ్యూజిక్ క్రియేట్ అవుతున్నట్లుగా ఉంటుంది, ఈ సినిమాని చాలా నేచురల్ గా తీశారు. ఆ నేచురల్ ప్రాసెస్ ని పట్టుకుని మ్యూజిక్ చేయడానికి నాకు కూడా కొంత సమయం పట్టింది. డీఫాల్ట్ టెంప్లెట్ ఉండే మ్యూజిక్ ని ఇందులో చేయలేదు. నిజానికి ఎలాంటి సౌండింగ్ చేయాలా అనేది కొంచెం వెతుక్కోవాల్సి వచ్చింది. ఒకసారి సెట్ అయిన తర్వాత ఆర్ఆర్, సాంగ్స్ అద్భుతంగా వచ్చాయి. ఇప్పటికే సాంగ్స్ కి చాలా సాంగ్స్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇందులోని పాటలు మూవీ తో పాటు ఇంకా రీచ్ అవుతాయి. ఇందులో లిరిక్స్ సింగిల్ కార్డ్ కాసర్ల శ్యామ్ గారు రాశారు. ప్రతి లిరిక్ కథకు చాలా ఇంపార్టెంట్. మంచి లవ్ సాంగ్ కూడా ఉంది. డైరెక్టర్ చాలా జెన్యూన్ గా ఈ సినిమాను తీశారు. ఇందులో ఒక విలేజ్ సాంగ్ ఉంది. దాన్ని రూరల్ గా కాకుండా కొంచెం వెస్ట్రన్ స్టైల్ లో చేయడం జరిగింది. అలాంటి ప్రయోగం చేసే అవకాశం కూడా డైరెక్టర్ గారు ఇచ్చారు. చాలా సపోర్ట్ చేశారు. నా సాంగ్స్ లో లిరిక్స్ బాగా వినపడతాయని దాదాపు లిరిక్ రైటర్స్ అందరూ నాతో ఈ మాట చెప్పారు. ట్యూన్స్ లో కూడా లిరిక్స్ చాలా చక్కగా కూర్చుంటాయి. నేనొక డమ్మి లిరిక్ అనుకునే ట్యూన్ చేసుకుంటాను. నేను ఎలాంటి హుక్ లైన్స్ అనుకుంటున్నానో రైటర్స్ కి ఈజీగా తెలుస్తుంది. దీంతో రైటర్ కి కూడా వర్క్ ఈజీ అవుతుంది. నా సాంగ్స్ లో ఎక్కువగా లిరికల్ స్కోప్ ఉంటుంది. లిరిక్ రైటర్స్ కూడా అంత అద్భుతంగా రాయడం, సింగర్స్ అద్భుతంగా పాడడం వలన పాటలు ఇంత చక్కగా రీచ్ అవుతున్నాయని భావిస్తాను.

# 'L2 ఎంపురాన్' జయేద్ మసూద్ ఫస్ట్ లుక్ పోస్టర్



'లూసిఫర్' 2019లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'L2 ఎంపురాన్' రాబోతోంది. స్టార్ హీరోలతో భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మించే చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ హీరోగా రాబోతోన్న ఈ చిత్రంలో సౌత్ స్టార్‌లు నటిస్తున్నారు. తొలి భాగం హిట్ కావటంతో సినిమాపై ఎలాంటి అంచనాలున్నాయో ముందుగానే అంచనా వేసిన మేకర్స్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను మించేలా సినిమాను నిర్మిస్తున్నారు. మోహన్ లాల్, వెర్సటైల్ యాక్టర్, డైరెక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న మూడో చిత్రం కావటంతో అభిమానుల్లో అంచనాలు ఆకాశన్నంటాయి. మోహన్‌లాల్ పుట్టినరోజు సందర్భంగా 'L2 ఎంపురాన్' లో ఖురేషి అబ్రమ్‌గా సూపర్‌స్టార్ లుక్‌ను విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇక ఇప్పుడు పృథ్వీరాజ్ సుకుమార్ బర్త్ డే సందర్భంగా ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో ఖురేషి అబ్రమ్‌కు రైట్ హ్యాండ్‌లా జయేద్ మసూద్ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమార్ కనిపించనున్నారు. తాజాగా రిలీజ్ చేసిన జయేద్ మసూద్ కారెక్టర్ ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. ఎంపరర్ జనరల్ అంటూ జయేద్ మసూద్ పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రంలో టోవినో థామస్, మంజు వారియర్, నందు, సానియా అయ్యప్పన్ తదితరులు మరోసారి వారి పాత్రలతో మెప్పించబోతున్నారు.

# 'గగన మార్గన్' ఫస్ట్ లుక్ విడుదల



నటుడిగా, దర్శకుడిగా, లిరిసిస్ట్‌గా, సంగీత దర్శకుడిగా తన సత్తాను చాటుకున్నారు విజయ్ ఆంటోని. మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోనీ డిటెక్టివ్ ఫిక్షన్ ప్రపంచంలోకి అందరినీ తీసుకెళ్లేందుకు గ్రిప్పింగ్ మర్డర్ మిస్టరీక్రైమ్ థ్రిల్లర్‌తో రాబోతున్నారు. విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ బ్యానర్‌పై మీరా విజయ్ ఆంటోని సగర్వంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ మూవీ టైటిల్‌ను తాజాగా రివీల్ చేశారు. 'గగన మార్గన్' అంటూ రిలీజ్ చేసిన టైటిల్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విజయ్ ఆంటోని రెండు రకాలుగా కనిపించారు. గాయపడి ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన విజయ్ లుక్ కొత్తగా ఉంటే.. నీటి అడుగు బాగాన ఉన్న వ్యక్తి పోస్టర్ కూడా ఇందులో కనిపిస్తోంది. "అట్టకత్తి", "బీడ", "సూదు కవ్వం", "ఇంద్రు నేత్ర నాళై", "తేకడి", "ముండాసుపట్టి", "కదలుం కాదందు పోగుం", "ఏ 1", "మాయవన్" వంటి చిత్రాలకు ఎడిటర్‌గా పేరు తెచ్చుకున్న లియో జాన్ పాల్.. 'గగన మార్గన్'తో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. లియో జాన్ పాల్ 2013లో "ఇదర్‌కుతానే ఆసైపట్టై బాలకుమార" చిత్రానికి ఉత్తమ ఎడిటర్‌గా తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డును గెలుచుకున్నారు. 'గగన మార్గన్' అన్ని వర్గాల వారిని ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చిత్రాన్ని త్వరలో థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# డిసెంబర్ 21న 'మ్యాజిక్'



ఒక వైపు భారీ సినిమాలను రూపొందిస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్య భరిత చిత్రాలను అందిస్తూ ఘన విజయాలను సాధిస్తోంది ప్రముఖ నిర్మాత సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'మ్యాజిక్' అనే సినిమాను సితార రూపొందిస్తోంది. ఈ మ్యూజికల్ డ్రామాలో ఎందరో నూతన నటీనటులు నటిస్తున్నారు. ఈ చిత్రంతో ప్రేక్షకులకు మరపురాని థియేట్రికల్ అనుభూతిని అందించడానికి ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. 'మ్యాజిక్' చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. అనిరుధ్ పుట్టినరోజు సందర్భంగా, నిర్మాతలు చిత్ర విడుదల తేదీని ప్రకటించారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 21, 2024న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఎంతో సృజనాత్మకంగా ఉంది. తమ కాలేజీ ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపరచడానికి నలుగురు టీనేజర్లు చేసే ప్రయత్నం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఈ సినిమాలో యువతను ఆకట్టుకునే అంశాలు ఎన్నో ఉన్నాయి. కల నెరవేరాలంటే మొదట ప్రయత్నించాలి. ఆ ప్రయత్నాన్ని అందమైన ప్రయాణంలా చూపించే 'మ్యాజిక్' చిత్రం, థియేటర్లలో ప్రేక్షకులను మాయ చేయనుంది.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.